Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 25.07.2014, శుక్రవారం
సంపుటి : 34 సంచిక : 08
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## అసమానం ఓ అభిమానం

### • పరవశించిన నెల్లూరు నగరం

**తల్లీదండ్రులతో ఉండేది ప్రేమబంధం. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళతో ఉండేది రక్తసంబంధం. ఆత్మీయులతో ఉండేది అనుబంధం. బిడ్డలతో ఉండేది అనురాగబంధం. మరి కన్నతల్లి లాంటి ఊరితో ఉండేది... ప్రేమానురాగ అను బంధం. సమాజంలోని అన్ని బంధాలను కలిపి చూపేదే సొంతూరితో ఉన్న సంబంధం.**

అమ్మ మీద, అన్నం మీద ఎంత కాలమని అలిగి ఉండగలం. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు యం.వెంకయ్యనాయుడు విషయంలో ఇదే జరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు ఆయనకు మనస్థాపం కలిగించాయి. దేశమంతటా నరేంద్ర మోడీ ప్రభంజనం మిగిల్చిన ఆనందం కంటే నెల్లూరుజిల్లాలో సొంత పార్టీ అభ్యర్థుల పరాజయం ఆయనకు తీరని నిరాశను మిగిల్చింది. అసంతృప్తికి గురిచేసింది. తన రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆయన తనలోని అసంతృప్తిని (మిగతా 12వ పేజీలో)



### సన్మానం



### సత్కారం




12లో

### సత్కార్యం



10లో



### • ప్రజాస్వామ్యం గెలిచింది

## ప్రజాతీర్పు నిలిచింది

**ప్రజాస్వామ్య దేశంలో ప్రజాతీర్పు అత్యుత్తమమైనది. ప్రజాతీర్పును తప్పుదారి పట్టించి, అడ్డదారుల్లో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తే ప్రజలే కాదు కదా ఆ దేవుడు కూడా క్షమించడు. నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక విషయంలో వివాదాలు, గొడవలపై దేవుడు కూడా ఆగ్రహించినట్లున్నాడు. కాబట్టే ఇక్కడ న్యాయాన్ని, ధర్మాన్ని గెలిపించి కలికాలంలో కూడా ధర్మం అంతో ఇంతో బ్రతికుందని నిరూపించాడు.**

నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ 14వ ఛైర్మెన్‌గా బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఈ నెల 24న జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 20వ తేదీన జడ్పీ సమావేశ మందిరంలో ముచ్చటగా మూడోసారి ఛైర్మెన్ ఎన్నికను నిర్వహించారు. వైకాపాకు 31మంది జడ్పీటీసీలు ఉండగా వారిలో 8మంది తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో అక్కడ చేరిపోయారు. దీంతో ఇరు పార్టీలకు చెరో 23మంది జడ్పీటీసీలయ్యారు. తెలుగుదేశంపార్టీ నాయకులు 20వ తేదీ ఎన్నికను కూడా వాయిదా వేయించాలని ప్రయత్నించారు. అయితే ఆరునూరైనా ఆరోజే ఛైర్మెన్ ఎన్నికను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం గట్టిగా ఆదేశించింది. దీంతో 23మంది సభ్యుల బలంతోనే తెలుగుదేశం ఎన్నికలకు సిద్ధమైంది. ఇక ఎన్నిక ప్రక్రియలో వైకాపా అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి 23మంది, తెలుగుదేశం అభ్యర్థి వేనాటి రామచంద్రారెడ్డికి 23మంది సభ్యులు చేతులెత్తడంతో (మిగతా 12వ పేజీలో)

### విద్యార్థులతో చెలగాటం

(వివరాలు 10వ పేజీలో)





# నెల్లూరుపై వరాల వాన

- వెంకయ్య, చంద్రయ్యల రాకతో పులకించిన సింహపురి
- ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుతో కొత్త కళ
- త్వరలో స్మార్ట్ సిటీగా నగరం
- ఎట్టకేలకు భూగర్భడ్రైనేజీకి మోక్షం

***నిజంగా సింహపురి ప్రజల ఎన్నో ఏళ్ళ నాటి స్వప్నం. ఇన్నాళ్లకు ఇప్పుడు నిజమైంది. ఎట్టకేలకు నెల్లూరులో సుందరమైన భవంతులతో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు పూర్తయింది. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడుల చేతుల మీదుగా ఈ వైద్యకళాశాల ప్రారంభోత్సవం ఎంతో ఘనంగా జరిగింది.***

ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ దృశ్యం ఈ నెల 19వ తేదీన కళ్ళ ముందు ప్రత్యక్షమైంది. నెల్లూరుజిల్లా ప్రజలు ఎంతో సంతోషించిన సందర్భం ఇది. దాదాపు 370 కోట్ల రూపాయల వ్యయంతో ఈ వైద్యకళాశాలను నిర్మించారు. ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటుతో నెల్లూరుకు కొత్త కళ వచ్చినట్లయింది. కేంద్ర ప్రభుత్వంలో అటు పార్లమెంటరీ వ్యవహారాలు, ఇటు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, ప్రధాని మోడీ మంత్రివర్గంలో ఎంతో కీలకబాధ్యతలు నిర్వహిస్తున్న సింహపురి ముద్దుబిడ్డ వెంకయ్యనాయుడు, మరోవైపు నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా మార్చాలని తపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇద్దరూ ఒకేసారి నెల్లూరు నగరానికి విచ్చేసి ఈ వైద్యకళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం, వారితో పాటు రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పి.నారాయణ, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు అనేకమంది విచ్చేయడంతో సింహపురి ప్రముఖుల రాకతో కళకళలాడింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు వరాల జల్లు కురిపించారు. పారిశ్రామిక రంగంలో పరుగులు తీస్తున్న నెల్లూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణపట్నం పోర్ట్‌ను కేంద్రం స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీగా గుర్తించిందని, ఆ మేరకు అక్కడ అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని అన్నారు. సముద్రతీర ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని మైపాడు, కోడూరు బీచ్‌లను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం ప్రజలకు ఆనందాన్ని కలిగించింది. ఆ తర్వాత, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు అనేకమంది ప్రముఖులు, నాయకులు, పలు పార్టీలవారు అంతా కలసి నగరంలోని విపిఆర్ కళ్యాణమండపంలో పెద్దఎత్తున పౌరసన్మానం నిర్వహించారు ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, జిల్లా ప్రగతికి అన్ని విధాల కృషి చేస్తామన్నారు. నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని, కృష్ణపట్నం నుంచి కడప జిల్లాలోని ఓబులాపురం వరకు మూడేళ్ళలో రైల్వే లైన్ ఏర్పాటు చేస్తామని, అందుకు దాదాపు పన్నెండువందల కోట్ల రూపాయలు వ్యయమవుతాయని అన్నారు. నెల్లూరులో డ్రైనేజీ సమస్యను తీర్చేందుకు కృషి చేస్తామని, అందుకు 570 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడం నెల్లూరు ప్రజలకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. అదేవిధంగా మంచినీటి సమస్యల నివారణకు అవసరమైన నిధుల మంజూరుకు కృషిచేస్తామని ఆయన హామీ ఇవ్వడం ప్రజలకు ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కామినేని శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ అజీజ్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని వెంకయ్యనాయుడును ఘనంగా సత్కరించారు. జిల్లా అభివృద్ధికి చేస్తున్న, చేయాల్సిన పనులను సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ పరిధిలోని ఆమంచర్ల వద్ద సుమారు 150 ఎకరాల్లో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్ర క్రీడాశాఖ మంత్రితో సంప్రదింపులు జరిపామన్నారు. గతంలో ఎఫ్‌ఎం రేడియోస్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించినా అది అన్యాక్రాంతం కావడంతో, దీనిపై వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆయన అధికారులకు సూచించారు. ఇలా.. జిల్లాకు సంబంధించి, నెల్లూరు నగరాభ్యున్నతికి సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావిస్తూ అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇటు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా జిల్లా ప్రగతికి అనేక వరాలు ఇవ్వడం జిల్లా ప్రజలకు ఎంతో సంతోషం కలిగింది. ఈ నేపథ్యంలో.. నెల్లూరు ప్రగతికి మార్గం సుగమమైనట్లేనని ప్రజలంతా భావిస్తున్నారు.

















# పదవితో పాటు పరువూ పోయింది

## జడ్పీ వ్యవహారంలో అభాసుపాలైన జిల్లా తెలుగుదేశం

***జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక వ్యవహారంలో తెలుగుదేశం నాయకుల పరిస్థితి రెంటికి చెడిన రేవడి అయ్యింది. వ్రతం చెడ్డా ఫలితం దక్కకుండా పోయింది. అధికారాన్ని దుర్వినియోగం చేసి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంచేసి, ప్రజానిర్ణయాన్ని తుంగలో తొక్కి, ఎన్ని అడ్డదారులున్నాయో, అన్నింటినీ ఉపయోగించుకున్నా చివరకు అనుకున్న లక్ష్యం నెరవేరకుండా పోయింది. వల విసిరిన జడ్పీ ఛైర్మెన్ కుర్చీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఖాతాలో చేరిపోయింది.***

నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక విషయంలో తెలుగుదేశంపార్టీ పూర్తిగా అభాసుపాలయ్యింది. ఈ ఛైర్మెన్ కుర్చీ కోసం అధికార దుర్వినియోగాన్ని తారాస్థాయికి చేర్చింది. సొంత పార్టీ నాయకులే పదవుల కోసం మరీ ఇంతగా దిగజారిపోవాలా అనే స్థాయిలో ఆగడాలు జరిపింది. అయినా బొక్కబోర్లా పడి పరువు పోగొట్టుకుంది.

అధికారం చేతిలో వున్నంతమాత్రాన అన్నీ జరిగిపోవనేదానికి నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక ఫలితమే ఒక ఉదాహరణ. జిల్లా పరిషత్ ఎన్నికల ఫలితాలలో వైయస్సార్ కాంగ్రెస్‌కు 31జడ్పీటీసీలు రాగా తెలుగుదేశంకు 15జడ్పీటీసీలు మాత్రమే వచ్చాయి. వీటి తర్వాత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చుంటే ఎలాంటి తలనొప్పి లేకుండా వైకాపా మొదటి సమావేశంలోనే ఛైర్మెన్ సీటును గెలుచుకుని ఉండేది. కాని తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో సీన్ మారిపోయింది. వైకాపాలో సగం సీట్లు కూడా లేని తెలుగుదేశం నాయకులు జడ్పీ ఛైర్మెన్ కుర్చీని స్వాధీనం చేసుకోవాలనుకున్నారు. ఇందుకోసం వైకాపా జడ్పీటీసీలపై వల వేశారు. మొదటి వలకే ఆరుమంది వైకాపా జడ్పీటీసీలు పడిపోయారు. జూన్ 5వ తేదీన మొదటిసారి జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నికను నిర్వహించారు. ఆరుమంది వైకాపా జడ్పీటీసీలు వచ్చినా తెలుగుదేశంకు బలం సరిపోలేదు. దాంతో ఆరోజు సమావేశంలోనే పెద్దఎత్తున గందరగోళం సృష్టించారు. సమావేశంలోనే వైకాపా సభ్యులను తమ వైపుకు లాక్కునే ప్రయత్నం చేసారు. అన్ని టీవీలలోనూ ఈ దృశ్యాలు ప్రసారమయ్యాయి. ఆరోజు గొడవతో ఎన్నిక వాయిదా పడింది. కాగా ఈ నెల 13న రెండోసారి ఎన్నిక కోసం సమావేశం నిర్వహించగా తెలుగుదేశం నాయకులు సరైన సంఖ్యాబలం లేకపోవడంతో జడ్పీహాల్‌కు వచ్చినా సంతకాలు చేయలేదు. ఆరోజు కోరం లేదని చెప్పి ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఎన్నికను వాయిదా వేశారు. ఆరోజు వైకాపా జడ్పీటీసీలతో కలిసి వచ్చిన కావలి జడ్పీటీసీ పెంచలమ్మను విచారణ కోసం బయటకు తీసుకెళ్లారు. విచారణ పేరుతో ఆమెపై 2గంటల పాటూ ఒత్తిడి తెచ్చారు. దాంతో ఆరోజు ఆమె సమావేశం నుండి ఎవరికీ మద్దతు తెలపకుండానే వెళ్లి పోయింది. ఆ తర్వాత కావలి జడ్పీటీసీ కూడా తెలుగుదేశం శిబిరంలో చేరిపోయింది. దీంతో చెరి 23మంది సభ్యులలో రెండుపార్టీలు సమమయ్యాయి. మరో జడ్పీటీసీ చేజారకుండా వైకాపా గట్టిగా పట్టుకుంది. వ్యూహాత్మకంగా జాగ్రత్త పడింది. మిగిలిన 23మందిని కాపాడుకోవడం వల్లే 20వ తేదీ లక్కీడ్రా అవకాశమొచ్చి అదృష్టం కొద్ది ఛైర్మెన్ గిరిని వైకాపా సొంతం చేసుకోగలిగింది.

### ఎక్కడ దెబ్బ పడింది...?

8మంది జడ్పీటీసీలను తెలుగుదేశంవాళ్లు అదనంగా పొందగలిగారు. ఇంకొక్క జడ్పీటీసీ ఉండుంటే ఛైర్మెన్ కుర్చీ వారిదే! కాని ఆ ఒక్కటి తెచ్చుకోలేక బొక్కబోర్లాపడ్డారు. జడ్పీ ఛైర్మెన్ సీటు కోసం అధికార మంత్రాంగాన్ని, పోలీసు సిబ్బందిని 'దూకుడు' సినిమాలో బ్రహ్మానందంను వాడుకున్నట్లు వాడేసుకున్నారు. అయితే ఈ వాడకంలో ఓ పదిశాతం వాడకం నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికపై చూపి ఉంటే ఫలితం ఉండేది. అక్కడ తేడా ఆరు సీట్లే! ఇప్పుడు చేసినదాంట్లో పదోవంతు అధికార ప్రయోగం అక్కడ చేసివుంటే మేయర్ పదవి తెలుగుదేశందై ఉండేది. ఈ ప్రభావం ఆటోమేటిక్‌గా జడ్పీ ఛైర్మెన్ ఎన్నికపై కూడా పడివుండేది. మేయర్ తెలుగుదేశంకు పోయింది కాబట్టి, జడ్పీ కూడా ఇక తెలుగుదేశంకు పోతుందనే ఫీలింగ్ వచ్చి ఇంకొంతమంది జడ్పీటీసీలు సులభంగా తెలుగుదేశంవైపు వచ్చేవాళ్లు. ఎప్పుడైతే మేయర్‌ను వైకాపా కొట్టగలిగిందో, అదే ఆత్మస్థైర్యం వారికి జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నికలోనూ పనిచేసింది.


దువ్వూరు రాజగోపాల్ రెడ్డి
ఇండస్ట్రియలిస్ట్
దువ్వూరు గోపాల్ రెడ్డి
దువ్వూరు సుజాతమ్మ
మండల ప్రెసిడెంట్, దొరవారిసత్రం
ధర్మో రక్షతి రక్షితః
ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనల్ని రక్షిస్తుంది. ఈ భగవద్గీత సూక్తిని అక్షరాలా పాటించారు మీరు.
ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎన్నెన్నో రాజకీయ కుట్రలు పన్నినా... అన్నింటినీ ఛేధించారు.
రాజకీయ జన్మనిచ్చిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అండగా నిలిచారు. ఇది ధర్మ విజయం. ప్రజా విజయం. దేవుడిచ్చిన విజయం.
శ్రీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి గారిని
జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎన్నుకున్న
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీలకు...
శ్రీమతి దువ్వూరు సుజాతమ్మ గారిని
దొరవారిసత్రం మండలం ఎంపిపిగా ఎన్నుకున్న
వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎంపీటీసీలకు...
ఈ విజయాలకు కారకులైన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులకు, కార్యకర్తలకు
పేరుపేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.
బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి
ఛైర్మెన్, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్
పెమ్మారెడ్డి త్రిలోక్ చంద్రారెడ్డి
సూళ్లూరుపేట
దువ్వూరు బాలచంద్రారెడ్డి
వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ




## వరుణ జపాలు

సాక్షాత్తు కల్యాణ శ్రీనివాస చక్రవర్తి నివసించే తిరుమలలోనే వర్షం లేక తెలుగుగంగను మళ్లించారు. రాష్ట్రంలో వర్ష ఛాయలు లేవు. సముద్రతీరాల్లో, దేవాలయాలలో వానల కోసం వరుణజపాలు, ఘటాభిషేకాలు చేస్తున్నారు. ప్రకృతి ముందు ఎవరూ అధికులు కారు. భవిష్యత్ చెప్తామని చెప్పే రామదూతలకు వారి సంగతి వారికే తెలియదు. ప్రకృతిని కాపాడితేనే అది మనల్ని కరుణిస్తుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## రాజధానిని తేల్చండి

గుంటూరు, విజయవాడల మధ్యే రాజధాని అని సీఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణ పదే పదే చెబుతున్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతంలోనే రాజధాని పెట్టాల్సిన అవసరమేముంది. ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాలకు అనుసంధానంగా చౌకగా భూములుండే ప్రాంతాల్లో రాజధానిని ఎంపికచేస్తే కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు గుంటూరు, విజయవాడల వద్ద సారవంతమైన భూములను కోల్పోయే ప్రమాదముండదు. అన్ని జిల్లాలకు కేంద్ర బిందువుగా రాజధాని ఉండాలి. అదే సమయంలో విలువైన భూములనూ కాపాడుకోవాలి. ముందుగా ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌ను వదిలి రావాలి.

పి.కృష్ణ, వెంకటగిరి.

## విగ్రహానికి నిధులా?

కేంద్ర వార్షికబడ్జెట్‌లో గుజరాత్‌లో నిర్మిస్తున్న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహానికి 200 కోట్లు కేటాయించడం సముచితం కాదు. పటేల్ గొప్పనేత. ఆయన విగ్రహాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కాని 200కోట్లుతో ఎన్నో అభివృద్ధి పనులు చేయొచ్చు. అదీగాక నరేంద్ర మోడీ గుజరాత్ సీఎంగా వున్నప్పుడు పెట్టుకున్న కార్యక్రమమిది. దాతలు, పారిశ్రామికవేత్తలు, ప్రజల నుండి స్వచ్ఛందంగా సేకరించిన విరాళాలతో ఇలాంటి విగ్రహాలు నిర్మించాలే గాని ఇలా కేంద్ర బడ్జెట్‌లో నేరుగా నిధులు కేటాయించు కాదు.

షేక్ బషీర్, నెల్లూరు.

## 'ప్రభా'తం

కోట్లాది రూపాయల అప్పులు, కుప్పలు తెప్పలుగా సమస్యలు, భరించలేనంత లోటు బడ్జెట్.. సంక్షోభంలో వ్యవసాయరంగం, ఆరని నిప్పులగుండంలా నిరుద్యోగం, విద్య-వైద్యం-పరిశ్రమలు వంటి ప్రాధాన్యతారంగాలు చతికిలబడిపోవడం.. సాగునీరు, విద్యుత్‌వంటి ప్రాణప్రదమైన రంగాలు కుదేలైపోవడం... మరోవైపు ఎటుచూసినా అవినీతి-అక్రమాలు పెరిగిపోవడం, సామాన్య జనం జీవనం సాగించలేనంతగా ధరలు ఆకాశానికంటడం.. ప్రగతి దారి పట్టాల్సిన రాష్ట్రం అధోగతి పాలవడం.. ఇలా ఎన్నో రకాల కష్టాలు..నష్టాలు..అన్నిటికీ మించి అందరి గుండెల్లో ఏదో తెలియని ఆవేదన...ఇవీ మనకు విభజన తర్వాత వాటాగా వచ్చిన ఆస్తులు.

కాంగ్రెస్ పాలనలో చిత్తం వచ్చిన రీతిగా అవలంభించిన అస్తవ్యస్త విధానాలు, అడ్డగోలు రాజకీయాలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. అవి ముఖ్యంగా నవ్యాంధ్రప్రదేశ్‌కు కన్నీళ్ళనే మిగిల్చాయి. ఈ కన్నీళ్ళ నుంచి, కష్టాల నుంచి.. ఈ నష్టాల నుంచి ఇప్పుడు గుండెదిటవుతో గట్టెక్కడమే ప్రస్తుత ధ్యేయం కావాలి. జరగకూడని నష్టం ఎలాగూ జరిగింది.. శోకభరితమైన నివాసంలో ఎన్నాళ్ళని నివసించగలం?.. మన దారి మనం చూసుకోవాలి. అది ప్రగతిదారి కావాలి.మన రాజధాని మనమే కట్టుకోవాలి. అది ఎక్కడ వుండాలి?.. ఎలా వుండాలి?.. ఏ ప్రాంతంలో వుండాలన్న కసరత్తు జరగాల్సిందే. అయితే, సీమాంధ్రలోని అన్ని జిల్లాలూ.. విభజనతో మానసికంగా తల్లడిల్లుతున్న జిల్లాలే. అందుకే, ప్రాంతమేదైనా అది ప్రజలందరికీ అనువుగా వుండాలన్నదే లక్ష్యం కావాలి. కొత్త రాజధాని సింగపూర్‌లా వుండాలా?.. లేక అంతకన్నా అధునాతన భవనాలతో వుండాలా?. అన్న తర్జనభర్జనలూ జరగాల్సిందే. అయితే, అన్నిటికీ మించి ఆ రాజధాని నవ్యాంధ్ర ప్రజల హృదయ దీపంలా వుండాలి. శోకం నుంచి శ్లోకం ఉద్భవించినట్లు, ఆ శ్లోకం లోకానికంతా వెలుగులు వెదజల్లినట్లు.. తెలుగువాడి హృదయావేదన నుంచి వెలువడే ఆవేదనే అభివృద్ధిమంత్రం కావాలి. అది నవ్యాంధ్రప్రదేశ్ అంతటా స్వర్ణకాంతులు వెదజల్లాలి. ప్రతి పనీ అభివృద్ధికి ప్రతీక కావాలి..శ్రమైక జీవన సౌందర్యానికి పతాకగా నిలవాలి. అందుకు ప్రభుత్వం, నేతలతో పాటు ప్రజలంతా అహరహం పరిశ్రమించాలి. మన రాజధానిని మనమే కష్టపడి నిర్మించుకోవాలి. అది తెలుగువాడి ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటేవిధంగా వుండాలి. నవ్యాంధ్ర.. స్వర్ణాంధ్రగా జగజ్జేయమానం కావాలి. ఇదే ప్రజలందరి ఆకాంక్ష. ఎన్ని కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా ధీరుడన్నవాడెప్పుడూ వెనుకంజ వేయడు. అప్పులను చూసి క్రుంగిపోవడం, ఆస్తులను చూసి పొంగిపోవడం వంటివి ధీరత్వ లక్షణాలు కావు. అప్పులను ఆస్తులుగా మార్చుకోవాలి. శాపాలను వరాలుగా చేసుకోవాలి. అపజయాల నుంచే విజయాలకు సోపానాలు వేసుకోవాలి. అస్తవ్యస్త విధానాలతో బూజుపట్టి వున్న ఇంటిని వదిలేసి, కొత్త విధానాలతో పదికాలాల పాటు సజావుగా వుండేందుకు సరికొత్త గృహాన్ని నిర్మించుకునేందుకు ఇదొక మంచి అవకాశంలా భావించాలి. ఒక మహోన్నతమైన రాజధానిని మన హయాంలో చూడబోతున్నాం..దానిని మనమే నిర్మించుకోబోతున్నాం అనే భావన ఎంతో అద్భుతమైనది. ఆ రాజధాని నిర్మాణంలో మనవంతు భాగస్వామ్యం వుండడం, అందుకు మనవంతు చేయూతనివ్వడం కంటే మంచి కార్యక్రమం మరొకటి లేదు. మన బిడ్డలకు.. భావితరాల వారికి మనం సగర్వంగా సమర్పించుకునే బృహత్తర రాజధాని నిర్మాణంలో మనమూ భాగస్వాములుగా వున్నామనే సంతోషం.. సంతృప్తి కంటే మనకింకేమి కావాలి?.. ఒక్క రాజధాని నిర్మాణానికే కాదు, స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధికి అడుగడుగునా మేమున్నామంటూ చేయూతనందిస్తోన్న భారత ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రప్రభుత్వం, బిజెపిలో అగ్రనాయకులైన వెంకయ్యనాయుడు వంటి మహానేతలు మనకండగా వుండగా, రాష్ట్రాభ్యున్నతికి నడుంకట్టి నిరంతరం పనిచేస్తున్న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో మనం కష్టాల నుంచి బయటపడడం పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పుడు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను, సవాళ్ళనూ అధిగమించేందుకు కూడా ఇదే మంచి తరుణం.

సీమాంధ్ర ప్రజలకు ప్రాణప్రదమైన పోలవరం నిర్మాణానికి వున్న అడ్డంకులన్నీ తొలగిపోవడం, రాజధాని నిర్మాణానికి కేంద్రప్రభుత్వం తరఫున నిపుణులు, ప్రముఖులు అధ్యయనాలు చేయడం, విద్యుత్ సరఫరా మెరుగుదలకు, సాగునీటిపారుదల, పరిశ్రమల రంగం అభివృద్ధికీ, విద్య, వైద్య రంగాల్లో ప్రగతికీ..ఇలా ఎక్కడ ఏది కావాలన్నా తమవంతు సాయం అందించేందుకు ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా వుండడం నిజంగా ఈ రాష్ట్రాభ్యున్నతికి ఒక వరం. మన రాష్ట్రంలో సహజసిద్ధమైన ప్రకృతి వనరులు పుష్కలంగా వుండడం, ఖనిజ సంపదకు లోటు లేకుండా వుండడం, అభివృద్ధికి ఎంతో అనువైన సముద్ర తీరప్రాంతం వుండడం, విద్యావైజ్ఞానిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతమైన యువశక్తికి కొదవ లేకపోవడం..ఇలా ఎన్నో వనరులు కొల్లలుగా వున్నాయి. వాటిని పరిశీలించి, సద్వినియోగం చేసుకోగలిగితే, చిత్తశుద్ధితో ఆచరణాత్మకమైన ప్రణాళికలతో ప్రగతి మార్గమే ధ్యేయంగా ముందుకు కొనసాగితే, ఎవరికి వారు శ్రమించి పనిచేస్తే..మనకే కాక.. భావితరాల వారికి కూడా ఎలాంటి లోటూ లేని సుందర రాష్ట్రాన్ని మనం అందించవచ్చు. అందుకు.. అన్నిటికన్నా ముఖ్యమైనది సుపరిపాలనే. మంచి పాలనతోనే ఇవన్నీ సాధ్యమవుతాయి. గుండె గాయాలను మాన్పుకొని, గుండె దిటవుతో పనిచేస్తూ.. అన్ని అవాంతరాలనూ అధిగమిస్తూ.. సమస్యలు సవాళ్ళకు దీటైన సమాధానమిస్తూ.. రాష్ట్ర ప్రగతిసాధనే లక్ష్యంగా ముందుకు... మునుముందుకు సాగిపోవడమే అందరి కర్తవ్యం కావాలి. మంచి రాజధాని నిర్మాణానికి, మంచి రాష్ట్రంగా మనకు మనం పునర్నిర్మాణం కావడానికి.. నవ్యాంధ్ర ఇక.. భవ్యాంధ్రగా... స్వర్ణాంధ్రగా దీపించడానికి ఇదే మంచి తరుణంగా భావించాలి. అందుకు అందరూ కర్తవ్యోన్ముఖులు కావాలి.

### ఇదే మంచి తరుణం



మన రాజధానిని మనమే కష్టపడి నిర్మించుకోవాలి. అది తెలుగువాడి ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటేవిధంగా వుండాలి. నవ్యాంధ్ర.. స్వర్ణాంధ్రగా జగజ్జేయమానం కావాలి. ఇదే ప్రజలందరి ఆకాంక్ష. అప్పులను ఆస్తులుగా మార్చుకోవాలి. శాపాలను వరాలుగా చేసుకోవాలి.

## 'అంతర్'జాతీయం

- అత్యంత కిరాతకంగా ఇతరుల ప్రాణాలను బలితీసుకుని మరణశిక్షను ఎదుర్కొంటున్న ఆరుగురికి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ క్షమాభిక్షను తిరస్కరించారు. హోంమంత్రి సిఫారసు మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. క్షమాభిక్ష లభించని వారిలో సంచలనాత్మకమైన వరుస అత్యాచారాలు, హత్యల కేసు నిందితుడు సురేంద్ర కోలి కూడా ఉన్నాడు.
- నదుల ద్వారా రవాణాను మెరుగు పరిచేందుకు 2వేల కోట్ల ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. దీని క్రింద రెండుదశల్లో 332కిలోమీటర్ల మేర జలమార్గాలను అభివృద్ధి చేస్తారు. ఈ పనులు 2017కల్లా పూర్తవుతాయి.
- నల్లధనం అంశంలో మరింత సహకారం గురించి చర్చించేందుకు తమ దేశానికి రావాలని స్విట్జర్లాండ్ ప్రభుత్వం భారత అధికారులను ఆహ్వానించింది. కాగా స్విట్జర్లాండ్‌లో భారత్‌కు సంబంధించిన నకిలీ కరెన్సీ పెద్దమొత్తంలో ఉన్నట్లు తేలింది. నకిలీ కరెన్సీలో యూరో, డాలర్ తర్వాత భారత రూపాయి మూడోస్థానంలో ఉంది.
- దేశంలో రక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను ప్రోత్సహించే దిశగా కేంద్రం పలు నిర్ణయాలు తీసుకుంది. రక్షణ కొనుగోళ్లకు సంబంధించి 21వేల కోట్ల విలువైన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.
- ఉక్రెయిన్ – రష్యా సరిహద్దుల్లో ఉగ్రవాదుల దాడిలో కూలిన మలేషియా విమాన ప్రమాద మృతులకు భారత ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి విచారణలో మలేషియా తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు నిస్తామని ఆయన ఆ దేశ ప్రధాని మహ్మద్ నజీబ్‌కు వ్రాసిన లేఖలో పేర్కొన్నారు.
- ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో టీమిండియా బోణీ కొట్టింది. లార్డ్స్‌లో హోరాహోరీగా జరిగిన తొలిటెస్ట్ మ్యాచ్‌లో ధోనీ సేన 95పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తుచేసి 1–0 ఆధిక్యం సాధించింది.
- యూపిఏ హయాంలో సుప్రీం కోర్టు మాజీప్రధాన న్యాయమూర్తులు ముగ్గురు రాజకీయ ఒత్తిళ్లకు తలొంచి రాజీపడి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక అదనపు న్యాయమూర్తి పదవీకాలాన్ని పొడిగించారని ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ జస్టిస్ మార్కండేయ కట్జూ ఆరోపించారు. దీనిపై పార్లమెంటులో దుమారం రేగింది.

## వార్త – వ్యాఖ్య

వార్త :- యూపీలో శాంతిభద్రతలు బాగాలేవు. – కేంద్రమంత్రి స్మృతి ఇరానీ.
**వ్యాఖ్య :- మిగతావన్నీ బాగున్నాయా..?**

వార్త :- ఏపీ ఎమ్మెల్యేలకు రాజధానిలో గూడు కరువు.
**వ్యాఖ్య :- అక్కడ అడుక్కునే బదులు సొంత రాష్ట్రంలోనే ఉండొచ్చుగా...!**

వార్త :- ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగం వస్తుంది. – బీజేపీ ఎంపీ కె.హరిబాబు.
**వ్యాఖ్య :- ఈతరం వాళ్లు చూస్తారంటారా?**

వార్త :- బీజేపీపై ముస్లింలకు విశ్వాసం పెరుగుతుంది. – కేంద్రమంత్రి నజ్మాహెప్తుల్లా.
**వ్యాఖ్య :- ఏ చెట్టూ లేని చోట ఆముదం చెట్టే మహావృక్షం కదా!**

వార్త :- ఆరునూరైనా రుణమాఫీ చేస్తాం. – మంత్రి రావెల.
**వ్యాఖ్య :- ఆరునూరైనా అంటే... ఆ స్థాయిలో పన్నులు పెంచుతారా?**

వార్త :- రుణమాఫీ జగన్‌కు ఇష్టం లేదు. – మంత్రి పత్తిపాటి.
**వ్యాఖ్య :- ఆ సాకు చూపి ఎగ్గొడతారా ఏంటి!**

వార్త :- సామాన్యుడికి ఒరిగిందేమీ లేదు. – ఎన్డీఏపై సీపీఎం మండిపాటు.
**వ్యాఖ్య :- పరీక్ష రాయకముందే ఫలితం చెప్పేస్తున్నారే!**

వార్త :- భూముల విలువ పెంపు ఖాయం.
**వ్యాఖ్య :- ఆదాయానికి ఉన్న దారుల్లో ఇదొకటి కదా!**

వార్త :- తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా సానియా!
**వ్యాఖ్య :- షోయబ్‌మాలిక్‌ను కూడా కలిపి పెట్టుకోవాల్సింది.**

వార్త :- వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలి. – ఐటి అధికారులకు ఆర్థికమంత్రి జైట్లీ పిలుపు.
**వ్యాఖ్య :- అడుక్కునే వాళ్ల చేత కూడా ఆదాయపన్ను కట్టిస్తారా... ఏంటి!**

వార్త :- సిమెంట్ ధరలు దించం. – కంపెనీలు.
**వ్యాఖ్య :- ఇంకా దంచుతామంటారా...?**

వార్త :- అల్పపీడనాలు ఏర్పడితేనే వానలు. – వాతావరణశాఖ.
**వ్యాఖ్య :- వానల కోసం తుఫాన్‌లు రావాలని కోరుకునే రోజులొచ్చాయి.**

# దాహార్తితో మూగజీవాలు విలవిల!



***అసలే వర్షాభావం.. అందుకు తగ్గట్టుగా నీటి కరువు. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో చివరికి పశుపక్ష్యాదులు, వన్యప్రాణులు సైతం నీరందక తీవ్రమైన దాహార్తితో అల్లాడిపోతున్నాయి.***

భూగర్భ జలాలు అడుగంటిపోవడం, వానలు కురవకపోవడం, చెరువులు దొరువులు, వాగులు వంకల్లో చుక్క నీరు కూడా లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇంకా మిడిమేలపు ఎండలు కాస్తూనే వున్నాయి. కారుమబ్బులు ఊరిస్తూనే వున్నాయి కానీ, నీలిమేఘాలు కరుణించడం లేదు. వానలు లేక అనేక మండలాల్లో కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. జూన్ నెల వెళ్లిపోయి, జూలై నెల కూడా గడిచిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో సేద్యం కూడా చతికిలబడిపోతోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో పెద్దసంఖ్యలో వున్న ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలకు సైతం సరైన మేత దొరకడం లేదు. ప్రధానంగా మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు, రాపూరు తదితర ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో వున్న పాడిపశువులు, మేత-నీరు లేక క్రమేణా మృత్యువాత పడుతున్నాయి. ఈ వర్షాభావ పరిస్థితుల్లో పశువులకు సరైన మేత లేక, అవి బక్కచిక్కిపోతుండడం, లేనిపోని వ్యాధుల పాలై మరణిస్తుండడం జరుగుతూనే వుంది. కొందరైతే వాటిని మేపలేక, మేతకు, నీళ్ళకు అవి పడే బాధలు చూడలేక, విధిలేని పరిస్థితుల్లో వాటిని అత్యంత చౌకధరలకు అమ్మేసుకుంటున్నారు కూడా. అనేక మూగజీవాలు కబేళాలకు తరలిపోతూనేవున్నాయి. బీడు నేలల్లో పచ్చిగడ్డిని విస్తారంగా సాగుచేసుకునే అవకాశం వున్నా, ఆ దిశలో ఎవరూ ఆలోచనలు చేయడం లేదు. పేద రైతులకు అవసరమైన భూములిచ్చి, అక్కడ నీటివనరులు కల్పించి, పచ్చిగడ్డి పెంపకానికి ప్రోత్సాహం ఇచ్చే నాథులు లేరు. ఏదో ప్రయోగాత్మకంగా పశుగ్రాసం విత్తనాలు ఇస్తున్నారే తప్ప, శాశ్వత ప్రాతిపదికపై మూగజీవాలకు ఇబ్బంది లేకుండా పశుగ్రాసాన్ని సిద్ధం చేసివుంచుకునే ప్రణాళికలూ లేవు.. ప్రయత్నాలూ లేవు. వానలొచ్చినప్పుడు నీటిని పదిలం చేసుకోవడం, ఎండాకాలం వచ్చినప్పుడు ఆ నీటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల ఇలాంటి విపత్కర పరిస్థితులను అధిగమించవ్చని అందరికీ తెలిసినప్పటికీ, ఆచరణ మాత్రం శూన్యం.

ప్రతిగ్రామంలోనూ అనువైన చోట్లలో చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు చేసుకోవడం, క్రమబద్ధంగా చెరువులు, కాలువల పూడికలు తీయించడం, మూగజీవాలకు ఉపయోగపడే విధంగా గ్రామీణప్రాంతాల్లో విస్తారంగా నీటి గుంటలు, నీటి తొట్లు ఏర్పాటు చేయడం వగైరా చర్యలు చేపట్టివుంటే మూగజీవాలకు ఇంత కష్టం వుండేది కాదు. ఇకనైనా, అధికారులు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ శాస్త్రవేత్తలూ, నిపుణులూ ఆలోచించి, ఈ సమస్యల పరిష్కారానికి మేలైన మార్గాలను అన్వేషించాలి. మూగజీవాల పరిరక్షణకు, తద్వారా పాడి పరిశ్రమ విస్తరణకు కృషి చేయాలి.


- **పశుగ్రాసం దొరక్క అవస్త**
- **నీరు లేదు.. నీటి తొట్లూ లేవు**
- **ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించని అధికారులు**

అందుకు గ్రామస్థాయిలో కమిటీలను నియమించి, సేవాభావంతో పనిచేసే వారిని ఎంపికచేసుకుని, నిపుణుల సలహాలతో, అధికారుల పర్యవేక్షణలో ఇలాంటి ఏర్పాట్లన్నీ శాశ్వత ప్రాతిపదికన చేయించడం ఎంతో అవసరం. మూగజీవాలకు తాగేందుకు నీరు, ఆకలి తీరేందుకు పశుగ్రాసానికి కూడా ఎంతకాలమని వేదన పడాలి?.. పచ్చిగడ్డి పెంపకాన్ని ఒక ప్రత్యామ్నాయ సాగుగా కూడా ప్రభుత్వం ఆలోచించాలి. ఆసక్తి కలిగిన పేదరైతులకు ఆ మేరకు అవగాహన కల్పించి, భూములిచ్చి ప్రోత్సహిస్తే ఎలా వుంటుందనే విషయాన్ని నిపుణులతో పరిశీలించాలి. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లోనూ, మైదానాల్లో వృధాగా వున్న బీడు భూములను, వాటిలో పచ్చిగడ్డి పెంపకానికి అనువుగా వున్న భూములను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో వున్న పేదరైతులకు వాటిని కేటాయించి పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహమిస్తే, పశుగ్రాసం కొరతా తీరుతుంది. నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించినట్లవుతుంది. అంతేకాదు, మరీ అత్యవసరమైన సందర్భాల్లో వారు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా పశుగ్రాసాన్ని చౌకధరకు అందించేవిధంగా కూడా ఏర్పాట్లు చేయగలిగితే మరీమంచిది. భవిష్యత్తులోనైనా జిల్లావ్యాప్తంగా పశుగ్రాసం కొరతను అధిగమించే పథకాలకు వెంటనే రూపకల్పన జరగాలి. అదేవిధంగా, మూగజీవాలకు అవసరమైన తాగునీటి కోసం అవసరమైన చోట్ల నీటి తొట్లను ఏర్పాటు చేయవచ్చు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు, ఆయా ప్రాంతాల్లో నీటి (మిగతా 10వ పేజీలో)

## కాలధర్మం

### పట్నం వేదాచలం

ఇందుకూరుపేట మండలం పల్లెపాడులోని గాంధీజీ ఆశ్రమ కమిటీ ట్రస్టీగా, పల్లెపాడు గ్రామసర్పంచిగా 40 ఏళ్ళు ఉత్తమ సేవలందించిన పట్నం వేదాచలం ఈనెల 20న కన్నుమూసారు. 2006లో రెడ్‌క్రాస్ గాంధీజీ ఆశ్రమ బాధ్యతలు తీసుకున్నంత వరకు ఆయన ట్రస్టీగా వున్నారు. 1956 నుంచి 1992 వరకు, 1997 నుండి 2007 వరకు సుదీర్ఘకాలం పల్లెపాడు గ్రామానికి సర్పంచిగా పనిచేసారు. సిపిఐ నాయకుడిగా కూడా పార్టీకి ఎనలేని సేవలు అందించిన ఆయన రాష్ట్ర ఉత్తమ సర్పంచి అవార్డు అందుకున్న గొప్ప వ్యక్తి ఆయన కుమారులు పట్నం శీనయ్య, రాజశేఖర్‌లు మూడేళ్ళక్రితమే మృతి చెందగా, భార్య మూడ్నెలల కిందట మరణించారు. ఆయన మృతిపట్ల సిపిఐ నాయకులు పముజుల దశరథరామయ్య కార్యవర్గ సభ్యులు పి.లీలామోహన్, నాగేంద్రబాబు, ఫకృద్దీన్, అన్వర్ తదితరులు సంతాపం తెలిపి మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలలతో నివాళులర్పించారు.

# కొత్త గెటప్‌లో వాకాటి




శాసన మండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి ఇప్పుడు సరికొత్త గెటప్‌లో దర్శనమిస్తున్నారు. ఆయన గెటప్ చూసి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. మొన్నటివరకు మనం చూసిన వాకాటి నారాయణరెడ్డికి నెత్తిమీద జుట్టుండేది కాదు, బట్టతల. మొన్న ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ప్రజలకు అదే విధంగా కనిపించారు. కాని నిన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వెంకయ్య సన్మాన కార్యక్రమానికి సరికొత్త గెటప్‌తో వచ్చారు. ఆయన నెత్తికి విగ్గు పెట్టుకున్నారు. విగ్గుతో వచ్చిన వాకాటిని చాలామంది గుర్తుపట్టలేకపోయారు. వేదిక మీదకు వాకాటి నారాయణరెడ్డిని పిలిస్తే ఈ కొత్త క్యారెక్టర్ వచ్చారెవరబ్బా... అని ఆశ్చర్యపోయారు.

# నవదీప్ రిలీవ్



జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ మంగళవారం విధుల నుండి రిలీవ్ అయ్యారు. ఇటీవల జరిగిన ఐపిఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఆయనను విజయనగరం ఎస్పీగా బదిలీ చేశారు. దీంతో మంగళవారం ఆయన రిలీవ్ అయ్యారు. నవదీప్‌సింగ్ గౌరవార్థం ఏఆర్ పోలీసులు బుధవారం ఉదయం పరేడ్‌గ్రౌండ్‌లో కవాతు నిర్వహించారు.

# స్వామిదాస్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు బాలాజీనగర్‌లోని బి.స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 1988లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆది, సోమవారాలలో రెండురోజుల పాటు నెల్లూరులోని గుడిగంట్ల బాలపీరయ్య కళ్యాణ మండపంలో జరిగింది. వివిధ ప్రాంతాలలో వివిధ హోదాలు, వృత్తులలో వున్న వారంతా ఇక్కడ కలుసుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమ గురువులను సన్మానించారు. తమతో పాటు చదివిన తమ మిత్రుడు నారాయణ కుమార్తె విద్యాభ్యాసానికి గాను పూర్వవిద్యార్థుల బృందం లక్ష రూపాయలను అందజేశారు. ఆ విద్యార్థిని చదువు పూర్తయ్యే వరకు కూడా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. పదిమందికి ఆదర్శంగా నిలిచేలా స్వామిదాస్ పూర్వవిద్యార్థులు వ్యవహరించారు.

# రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ నూతన కార్యవర్గం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట వప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో ఈనెల 20న రోటరీక్లబ్ నెల్లూరు సౌత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ రోటరీక్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ దాస్ పాల్గొన్నారు. గాదంశెట్టి గోపాల్ నూతన అధ్యక్షుడిగా, నవోదయ నూతన కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీహరిరెడ్డి పడుగుపాడులోని శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ॥5లక్షలు, ఎమ్వీఆర్ గోడౌన్స్ అధినేత మాధురి విద్యార్థుల అభివృద్ధి కోసం రూ॥ 25వేల విరాళాన్ని రోటరీ క్లబ్‌కు అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు సుందరి, కార్యదర్శి సతీష్ కుమార్, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్లు శ్రీకాంత్, సతీష్‌బాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## నాయకుల పర్యటనతో ఉత్సాహం





జిల్లాలో ఒకేసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు పర్యటించడంతో ఆయా పార్టీ కార్యకర్తల్లోనే కాదు, ప్రజలలోనూ ఎనలేని ఉత్సాహం వచ్చింది. జిల్లా అభివృద్ధిపై భరోసా ఏర్పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు 19వ తేదీ నెల్లూరులో జరిగిన ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభోత్సవంలోనూ, అక్కడే నిర్వహించిన బహిరంగ సభలోనూ పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం చంద్రబాబు రావడంతో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం ఇనుమడించింది.

ఇక కేంద్రమంత్రి వెంకయ్యనాయుడైతే మూడురోజుల పాటు నెల్లూరులో గడిపారు. పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. అభివృద్ధి వరాలిచ్చారు. అధికారులతో సమీక్షలు జరిపారు. ఆత్మీయులు, అభిమానులను కలుసుకున్నారు. ఆ మూడురోజులు నెల్లూరు రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని ఆయన ఇంటి వద్ద అయితే వాతావరణం వెంగమ్మ తిరునాళ్ళ మాదిరిగా ఉండింది.

## నందమూరికి భారతరత్న ఇవ్వండి

తెలుగుదేశం పార్టీ నేత, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి ఈనెల 20న నెల్లూరుకు వచ్చిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును కలిసి విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారకరామారావుకు "భారతరత్న" అవార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పి తెలుగు జాతి కీర్తిని దశదిశలా వ్యాప్తి చేసిన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావుకు ఇప్పటి వరకు భారతరత్నను ఇవ్వకపోవడం శోచనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాచపాళెం రఘు



పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరులో ఉపకార్మిక కమీషనర్‌గా పనిచేస్తున్న నెల్లూరీయుడు రాచపాళెం రఘు పేరు వండర్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేయబడింది. గత నలభై సంవత్సరాలుగా మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్య పరిచేలా హేతువాద సాహిత్యాన్ని అందిస్తున్నందుకు ఆయన పేరు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు చేసుకుంది.

ఈనెల 27న నెల్లూరు టౌన్ హాలులో జరిగే పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్షిణ భారత సమన్వయకర్త బింగి నరేంద్రగౌడ్ ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందిస్తారని "పినాకిని" అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు తెలిపారు.

# సిఐడికి వెంకటేశ్వర్లు

నెల్లూరు సిఐడి డిఎస్పీగా ఎం.వెంకటేశ్వర్లును నియమిస్తూ డిజిపి జె.వి.రాముడు ఉత్తర్వులు జారీచేసారు. సిఐడిలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఇటీవలే డిఎస్పీగా పదోన్నతి లభించింది. గుంటూరు జిల్లా రెంటచింతలకు చెందిన వెంకటేశ్వర్లు 1991లో ఎస్ఐగా పోలీస్‌శాఖలోకి వచ్చారు. నెల్లూరు, బిట్రగుంట, కలువాయి, ఉదయగిరి, టి.పి.గూడూరు, వెంకటాచలం, నెల్లూరుట్రాఫిక్‌లలో ఎస్ఐగా పనిచేసారు. 2007లో సిఐగా పదోన్నతి పొంది ట్రాఫిక్, ఆర్టీసీ, సిఐడి విభాగాలలో పనిచేసారు. ఇప్పుడు సిఐడి డిఎస్పీ అయ్యారు.

# 'రెడ్డి' పోలీసుకు ట్రైనింగ్

పోలీసుశాఖలో 'రెడ్డి' కుల అధికారులకు లూప్‌లైన్‌లు మొదలుపెట్టారు. ఇటీవలే డిఎస్పీలుగా పదోన్నతి పొందిన ముగ్గురు రెడ్లకు కేటాయించిన పోస్టులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తుంది. జిల్లాలో ఎంతోకాలంగా ఎస్ఐలు, సిఐలుగా విధులు నిర్వహించి ఇటీవల డిఎస్పీలుగా పదోన్నతి పొందిన వై.జయరామసుబ్బారెడ్డిని చిత్తూరు డిటిసికి, పి.వీరాంజనేయరెడ్డిని తిరుపతి పిటిసికి, వై.శ్రీనివాసులురెడ్డిని ఒంగోలు డిటిసికి బదిలీ చేసారు. పని పాటా లేని పోస్టుల్లో వీరిని నియమించారు.

# శివనాగేశ్వరరావుకు శానిటరీ పదవి

రాజమండ్రిలో ఈనెల 20న జరిగిన ఆంధ్రప్రదేశ్ శానిటరీ సూపర్‌వైజర్స్, ఇన్‌స్పెక్టర్ హెల్త్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరు శానిటరీ సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2007లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఈయన ఇప్పుడు హ్యాట్రిక్ సాధించినట్టయింది. ప్రస్తుతం మూడో తడవ కూడా రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవడం ఈయన పనితీరుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అలాగే రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నెల్లూరులో పనిచేస్తున్న సి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

# కౌలాలంపూర్ సదస్సుకు డాక్టర్ ఎ.జగదీష్



ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త, స్థానిక నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్ డైరెక్టర్, డాక్టర్ ఎ.జగదీష్‌కు కౌలాలంపూర్ (మలేషియా) ఆగష్టు 5,6 తేదీలలో జరిగే క్లీన్ ఏషియా పవర్‌లో ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చేందుకు ఆహ్వానం అందింది.

డాక్టర్ జగదీష్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, అప్రాప్రియేట్ టెక్నాలజీలలో విశేష కృషి చేశారు. ఆయన అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికలలో, సదస్సులలో 130కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ప్రపంచంలోనే ప్రాచీనమైన వైజ్ఞానిక పత్రిక 'నేచర్'లో డాక్టర్ జగదీష్ పరిశోధనా పత్రం ప్రచురితమైంది. ఆయన అభివృద్ధి చెందుతున్న పలు దేశాలలోని ప్రత్యామ్నాయ ఇందన వనరుల సంస్థలకు సలహాదారుడుగా సేవలు అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఇందన వనరులకు చెందిన 15కమిటీలలో సభ్యునిగా సేవలందించారు.

# రెయిన్‌బో వారి "బానియన్ ట్రీ"



నెల్లూరు మాగుంట లే అవుట్ రెయిన్‌బో స్కూల్ వారు స్థానిక పోలీస్ ఆఫీస్ రోడ్ నందు గల స్వర్ణవేదిక కళ్యాణ మండపంలో "బానియన్ ట్రీ" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నైలోని వ్యక్తిత్వ వికాస నిపుణులు, గో పోస్ట్ కంపెనీ సి.ఇ.ఓ మరియు ప్రవచన ప్రసంగీకులు ఆర్.గోపీనాథ్ పాల్గొని పాఠశాల ప్రార్థనా గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల పెంపకం వారి యొక్క సంరక్షణ గురించి వివరించారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల అనుసరించాల్సిన విధానం, వ్యవహరించాల్సిన తీరు వారి యొక్క శక్తి యుక్తులను వెలికితీసే విధానాన్ని పలు ఆసక్తికరమైన ఉదాహరణలతో "పవర్ పాయింట్ ప్రజెంటేషన్" ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి యం.ఇ.ఓ రమేష్, జడ్జ్ రామకృష్ణ హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మాసుబ్రహ్మణ్యం మరియు ప్రిన్సిపల్ శ్రీమతి అరుణాస్వయంప్రభలు మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గోపీనాథ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసారు.



ఈ నెల 22వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో వైద్యఆరోగ్య కార్యక్రమాలపై జరిగిన సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, డిఎంఅండ్ హెచ్ఓ డా॥ పద్మావతి

# నెల్లూరుకు నిధుల వెల్లువ



నెల్లూరు నగరంలో తాగునీటి, అండర్‌గ్రౌడ్ డ్రైనేజీ పనులకు 1503కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. సోమవారం నెల్లూరులోని నారాయణ వైద్యకళాశాలలో తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు లక్షలకు పైగా జనాభా వున్న నెల్లూరు నగరంలో ప్రజలు చాలాకాలంగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీటిని శాశ్వతంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడానన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తే కేంద్రం నుండి నిధులు విడుదల చేయిస్తానని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా హామీ ఇచ్చారని ఆయన చెప్పుకొచ్చారు. ఇందుకు సీఎం కూడా సుముఖత వ్యక్తం చేసారని చెప్పారు. త్వరలోనే చంద్రబాబుతో కలిసి ఢిల్లీకి వెళ్లి వెంకయ్యనాయుడుతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. రివైజ్డ్ అంచనాల ప్రకారం 30ఏళ్లకు తాగునీటి అవసరాలకు 550కోట్లు, అయిదేళ్ల నిర్వహణకు మరో 239కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ 639కోట్లు, నిర్వహణకు మరో 75కోట్ల రూపాయలను విడుదల చేయించనున్నట్లు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పనులకే 1503కోట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. సీమాంధ్రలోని అన్ని ప్రాంతాలకు అనుకూలంగా నూతన రాజధాని ఉంటుందని ఆయన చెప్పారు. కృష్ణ-గుంటూరు జిల్లాల మధ్య రాజధాని ఉంటే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తుందని, అయితే అది ప్రతిపాదన మాత్రమేనన్నారు.

### నెల్లూరులో...

# వ్యవసాయ విశ్వవిద్యాలయం పెట్టండి

కేంద్రప్రభుత్వం మంజూరుచేసిన వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నెల్లూరుజిల్లాలో ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జక్కా వెంకయ్య కోరారు. ఈ నెల 22న నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ వ్యవసాయశాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ ఇటీవల రాష్ట్రానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వెయ్యి ఎకరాల భూమి కావాలని అడిగారని, కొండాపురం మండలంలోని చింతలదేవి పశుక్షేత్రం ఇందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. చింతలదేవి వద్ద సుమారు 2700ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. బ్రిటీష్ వారి హయాంలో ఈ పశుక్షేత్రం ఏర్పడింది. ఈ క్షేత్రంలోనే ఒంగోలు జాతి ఎద్దులు, ఆవులు, నెల్లూరుజాతి జొడిపి గొర్రెల అభివృద్ధికి కృషి జరిగింది. మోపాడు రిజర్వాయర్ పరిధిలో ఈ క్షేత్రానికి 250ఎకరాల భూమి వుంది. కాబట్టి నీళ్లకు ఇబ్బంది లేదు. దీనికితోడు సోమశిల ఉత్తరకాలువ దగ్గరే కాబట్టి అసలు నీటికి వెదుక్కోవాల్సిన పని లేదన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని చింతలదేవి వద్ద ఏర్పాటు చేయించేందుకు జిల్లా ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, ఒక్క ఎకరా భూమి కొనే పని లేకుండా జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు పి.చంద్రమౌళి, మాజీడిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఋణమాఫీ... రైతన్నకు ఓ మంచి కాఫీ



**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

సింహపురి సమాచారం

ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఋణమాఫీని అమలు చేయడం రాష్ట్ర చరిత్రలో ఓ అపూర్వఘట్టమని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేసిన ఋణమాఫీతో ఈరోజు రైతులు, మహిళల ముఖాల్లో ఆనందాన్ని చూడగలుగుతున్నామన్నారు. దేశంలోగాని, రాష్ట్రంలోగాని ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి ఇటువంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోలేదన్నారు. విభజనతో రాష్ట్రం 16వేల కోట్ల లోటుబడ్జెట్‌తో ఉన్నా రైతులు, మహిళలు బాగుండాలనే సంకల్పంతో చంద్రబాబు 40వేల కోట్ల రూపాయలు ఋణ మాఫీ చేయడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7.65లక్షల మహిళాసంఘాలకు లక్ష చొప్పున 7655కోట్లు, ఒక్కో రైతుకుటుంబానికి లక్షా50వేల లెక్కన 33వేల కోట్లు ఋణాలు మాఫీ కానున్నాయన్నారు. ఋణమాఫీ చేయకుండా చంద్రబాబు ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించిన వై.యస్.జగన్ ఇప్పుడు ఎవరు మోసం చేసారో, ఎవరు 420లో చెప్పాలని డిమాండ్ చేసారు. సిబిడి నుండి ఈడి దాకా కేసులున్న జగన్ నిఖార్సైన 420 అని ఆయన విమర్శించారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు డాక్టర్ జడ్.శివప్రసాద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, వై.వి.సుబ్బారావు, సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలపై దృష్టి



నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనీల్‌కుమార్‌యాదవ్ ఈనెల 21న నగరములోని 5వడివిజన్‌లోని అహ్మద్ నగర్, బోడిగాడితోట, అరవపాళెం ప్రాంతాలలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా వంటి సమ్యసలను ప్రజలను అడిగి తెలుసుకునేందుకు పర్యటించారు.

ఈ సందర్భంగా అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అహ్మద్‌నగర్, బోడిగాడితోట, అరవపాళెం ప్రాంతాలలో పర్యటించినప్పుడు మంచినీటి సమస్య, వీధిలైట్లు సమస్య ఉందని ప్రజలు తెలియజేశారని ఆ సమస్యలను పరిష్కరించాలని కమీషనరు చెప్పడం జరిగిందని అన్నారు. అలాగే అరవపాళెం ప్రాంతంలో పర్యటిస్తే నగరంలో కూడా ఇలాంటి ప్రాంతము ఉందంటే బాధేస్తుందని, రోడ్లు లేక వీధి లైట్లు లేక కనీసము మంచినీటి వసతి లేకుండా ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాంత ప్రజలను అందరిని పిలిచి మాట్లాడటం జరిగిందని, వారందరూ కూడా నగర ప్రాంతంలోనే నివాసయోగ్యమైన స్థలం చూపించి ఇళ్ళు కట్టించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారని అందుకు అధికారులతో మాట్లాడి త్వరలోనే ఆ సమస్యకు పరిష్కారం చూపుతామని అన్నారు. నెల్లూరు పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు నెల్లూరు నగరంలో ఎక్కడెక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలు ఉన్నాయో వాటిని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని చెప్పడం శుభ పరిణామమని ఆ ప్రకారంగా నెల్లూరు నగరంలో ఉన్న అన్ని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఓబులి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, దేవరకొండ అశోక్, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు సంక్రాంతి కళ్యాణ్, పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అశ్వత్థామ, మంజూర్, సానా సుబ్బారెడ్డి, శ్రీహరిరెడ్డి, యస్.రమణారెడ్డి, శోభన్‌బాబు, నాగేంద్ర, జయకృష్ణ, శారద, పవన్, హనీఫ్, పెళ్ళూరు శ్రీనివాసులు, టి.రఘురామిరెడ్డి, యం.మురళీకృష్ణ, గంధం సుధీర్‌బాబు, బి.హరిప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.







# అంతరాత్మ ఆదేశంతో నెల్లూరుకు వెంకయ్య

శ్రీను గల్పిక

అది దేశ రాజధాని ఢిల్లీ నగరం. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి మరియు ఇళ్ల నిర్మాణశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు తన ఆఫీసులో కూర్చుని బిజీబిజీగా ఫైల్స్ చూస్తున్నాడు. అంతలో స్వర్ణాంధ్ర కమ్ నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్కడకు వచ్చారు. వెంకయ్య ఆయనను ఆహ్వానించి కూర్చోమని, ఏం ఇలా వచ్చారని అడిగాడు. చంద్రబాబు చేతులు పిసుక్కుంటూ... అదే 'ఋణమాఫీ' గురించి మాట్లాడదామని వచ్చానన్నాడు. ఆ మాట వినగానే వెంకయ్య ముఖం మాడ్చుకుని... కావాలంటే కప్పు కాఫీ తాగు, అంతేగాని ఋణమాఫీ మాట ఎత్తొద్దు అని చెప్పాడు. రైతులు బాగా అప్పుల్లో వున్నారని చంద్రబాబు చెప్పాడు. "రైతులన్నాక అప్పు... ఇంట్లో తోడికోడళ్ల మధ్య నిప్పు" కామన్ అని మళ్ళీ వెంకయ్య చెప్పాడు. నేను ఎన్నికల్లో ఋణమాఫీ చేస్తామని వాగ్దానం చేసాను, ఇప్పుడు డబ్బులేదని చంద్రబాబు చెప్పాడు. మనిషన్నాక డబ్బు లోటు, మానవ జన్మ ఎత్తాక జబ్బు పోటు మామూలే అని వెంకయ్య అన్నాడు. అక్కడితో చంద్రబాబుకు విరక్తి కలిగింది. సార్, పొరపాటున మీ వద్దకొచ్చి ఋణమాఫీ గురించి ఎత్తాను, ఇంకోసారి మీ వద్దకొస్తే మీకు నచ్చినదాంతో కొట్టండి అని చెప్పి అక్కడనుండి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వెంకయ్యనాయుడు ప్రశాంతంగా ఫైల్స్ అన్నింటిని చకచకా పూర్తి చేసుకుంటూ సాయంత్రం దాకా పనిచేసాడు. ఆ తర్వాత ఇంటికి చేరాడు. రాత్రి టిఫిన్ తింటూ టీవీ ముందు కూర్చున్నాడు. అప్పుడే టీవీ 9+9=99 ఛానెల్‌లో నెల్లూరు జడ్పీ ఎన్నికకు సంబంధించి సమావేశంలో సభ్యులు అరచుకోవడం, ఒకర్నొకరు తోసుకోవడం వంటి దృశ్యాలు వస్తున్నాయి. వాటిని చూడగానే వెంకయ్యకు నెల్లూరు మీద గాలి మళ్లింది. నెల్లూరును చూడాలనే కోరిక బలంగా కలిగింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన నెల్లూరు రాలేదు. అంతకు ముందు ఢిల్లీ నుండి రేణిగుంటకు విమానంలో సీజన్ టిక్కెట్ కొని వున్నాడు. నెలకు రెండుమూడు సార్లు ఠంఛన్‌గా నెల్లూరొచ్చే మనిషి నెల్లూరు జిల్లాలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో నిరుత్సాహం చెందాడు. దాంతో నెల్లూరుకు పోకూడదని మనసును బలవంతంగా అదిమి పట్టుకున్నాడు. ఇక నెల్లూరు ముఖం చూడకూడదు... చూడకూడదు అనుకుంటూ అక్కడే ఉన్న సోఫాలో పడుకుని నిద్రపోయాడు. అలా గుర్రు పెట్టి నిద్రపోతుండగా... వెంకయ్యా... వెంకయ్యా... అని ఎవరో పేరుపెట్టి పిలవడంతో ఆయన ఉలిక్కిపడి లేచాడు. కళ్లు నులుముకుని తెరచి చూసాడు. అంతే ఆశ్చర్యంతో ఆయన కళ్లు పెద్దవయ్యాయి. నోరు మరీ ఎక్కువుగా తెరిచాడు. కారణం ఆయన లాంటి మనిషే ఎదురుగా వున్నాడు. అచ్చం ఆయనలాగే ఉన్నాడు. కాకపోతే కళ్లకు నల్లద్దాలు పెట్టి ఉన్నాడు. ఎవర్నువ్వు...? అని వెంకయ్య ప్రశ్నించాడు. అతను... నమస్తే వెంకన్నా... నా పేరు వెంకూస్... నీ అంతరాత్మను అని చెప్పాడు. వెంకయ్యకు చిర్రెత్తుకొచ్చింది. నా వేషం వేసుకొచ్చి నా అంతరాత్మను అంటావా... పో... బయటకు అంటూ రెట్ట పట్టుకోబోయాడు. ఆశ్చర్యం... వెంకూస్ అక్కడే ఉన్నాడు గాని అతని చేయి వెంకయ్యకు తగల్లేదు. అవును... ఇతను తన అంతరాత్మే అని వెంకయ్య నిర్ధారించుకున్నాడు. నిజమే, నువ్వు నా అంతరాత్మవే... మరి కళ్లకు ఆ నల్లద్దాలేమిటి? అని వెంకయ్య ప్రశ్నించాడు. ఈమధ్య నెల్లూరెళ్లానులే... స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి ఇంట్లో వుంటే గిఫ్ట్‌గా తెచ్చుకున్నానని వెంకూస్ చెప్పాడు. దానికి వెంకయ్య... కొని కొత్తగా ఇచ్చేవాటిని గిఫ్ట్ అంటారు. అక్కడున్న సెకండ్ హ్యాండ్ సరుకును తెచ్చుకుంటే తెఫ్ట్ అంటారు. అయినా నెల్లూరు వెళ్లొచ్చావా... ఎలా వుంది నా ఊరు. ఎలా వున్నారు నా నెల్లూరోళ్లు అని వెంకయ్య ఆత్రుతగా అడిగాడు. అక్కడంత బాగా ఏమీ లేదు. పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయి. అందరూ నీ కోసం ఎదురుచూస్తున్నారు. నెల్లూరుకు పోవాలనే కోరిక ఉండి కూడా ఎందుకు పోలేకపోతున్నావని వెంకూస్ ప్రశ్నించాడు. అందుకు వెంకయ్య... అక్కడ ఎన్నికల ఫలితాలు నన్ను బాగా నిరాశకు గురిచేసాయి. ఒక్క సీటును కూడా గెలవలేకపోయాం. అందుకే నెల్లూరుకు వెళ్లనంటే వెళ్లను అని అన్నాడు. పార్టీలన్నాక కూటమి, ఎన్నికలన్నాక ఓటమి కామన్ కదా... వెంకయ్య అని వెంకూస్ చెప్పాడు. ఏమో నేను నెల్లూరు మీద అలిగాను, నాకు వెళ్లబుద్ధి పుట్టడం లేదని వెంకయ్య చెప్పాడు. బడికెళ్లేటప్పుడు పలక, బాధపడేటప్పుడు అలక సాధారణమే. అయినా బాత్‌రూంలో జారిపడ్డామని చెప్పి బాత్‌రూంకు పోవడమే మానుకుంటే బాధపడాల్సిందెవరు? లాజిక్‌గా ఆలోచించు అని వెంకూస్ చెప్పాడు. వెంకయ్య బాధతో... నేను నెల్లూరు నుండి ప్రజాప్రతినిధిని కాను, 1978, 83లలో ఉదయగిరి వాళ్లు నన్ను గెలిపించారు. ఆ తర్వాత గెలిచిన పాపానపోలేదు. ఎన్నికల్లో పోటీ మీదే విరక్తి కలిగిందన్నాడు. దేవుడన్నాక భక్తి, రాజకీయాలన్నాక విరక్తి కామన్. మాటలతో కార్యక్రమాలను రక్తికట్టించే నీలో ఈ విరక్తి ఏమిటని వెంకూస్ ప్రశ్నించాడు. దానికి వెంకయ్య... ఎన్డీఏ ప్రభుత్వంలో ఎన్నెన్ని పనులు చేసాను. ఎంతమంది కేంద్రమంత్రులను తీసుకొచ్చాను. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా ఎన్ని సేవా కార్యక్రమాలు చేసాను. అయినా ఈ ప్రజలు ఓట్లేయలేదే, సీట్లివ్వలేదే అని ఆక్రోశం వెలిబుచ్చాడు. కుక్కల్లో విశ్వాసం – రాజకీయాల్లో అవిశ్వాసం కామన్. ఎన్నికల్లో మీరు చూసేది ఓటు వైపు... జనం చూసేది నోటువైపు. రాజకీయ మంత్రం, ఎన్నికల రణతంత్రం అదే కదా వెంకయ్య. అయినా, నెల్లూరు ప్రజలు మీ పార్టీకి ఓట్లేయలేదంటే దానికి కారణం వాళ్లే కాదు, నువ్వు కూడా అని చెప్పాడు.

ఆ మాటకు వెంకయ్య అదిరిపడ్డాడు. అదేంటి, అంత మాటన్నావ్ అని వెంకూస్‌ను అడిగాడు. అప్పుడు వెంకూస్... నువ్వు ఈ పదేళ్లలో ఎప్పుడు నెల్లూరొచ్చినా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో, ఇంకెక్కడన్నా కార్యక్రమాలు నిర్వహించినా అన్ని పార్టీల వారిని ఆహ్వానించావు. అందరినీ వేదిక లెక్కించావు. ఎన్నికలప్పుడే రాజకీయాల గురించి మాట్లాడుకోవాలని, మిగతా సమయాల్లో అభివృద్ధి గురించే ఆలోచించాలని చెప్పావు. నెల్లూరు ప్రజలు మీ మాటలను బాగానే ఫాలో అయ్యారు. వాళ్లు మూమూలు సమయంలోనే కాదు, ఎన్నికల సమయంలోనూ రాజకీయాల గురించి ఆలోచించలేదు. సాధారణంగా తమ పంథాలోనే ఆలోచించి ఓట్లేసుకున్నారు. కాబట్టి తప్పు వారిదా? నీదా? అని ప్రశ్నించాడు. అప్పుడు వెంకయ్య... ఇదేమన్నా మా టీవీలో నాగార్జున నిర్వహించే 'మీలో ఎవరు కోటీశ్వరుడు' ప్రోగ్రామా? తప్పు నాదో, వారిదో చెప్పడానికి! అయినా నువ్వు చెప్పేదాన్ని బట్టి చూస్తుంటే ప్రజలు ఇలా ఫలితాలనివ్వడంలో నా పాత్ర కూడా ఉందనిపిస్తుంది.

కాబట్టి నా అలకను వీడి నెల్లూరుకు బయల్దేరుతానని చెప్పి... సత్య అంటూ పిలిచాడు. పక్క గదిలో పడుకుని నిద్రపోతున్న ఓఎస్‌డి సత్య పరుగెత్తుకుంటూ వచ్చాడు. మనం నెల్లూరు పోతున్నామని వెంకయ్య అన్నాడు. మరి మీ అలక అని సత్య అడిగాడు. మనిషిలో అలక, కొమ్మ మీద చిలక ఎప్పుడైనా ఎగిరిపోవాల్సిందే అంటూ నెల్లూరుకు బయల్దేరడానికి రెడీ అయ్యాడు.

కదంబం

## కొయ్య గుర్రం

– చిన్ని నారాయణరావు
నెల్లూరు. 94402 02942

గుర్రం కొయ్యదే -
అయినా సప్తసముద్రాలు దాటి
ఎక్కడో దాగిఉన్న దీపాన్ని
తట్టి లేపుతుంది
ఆ తేజోమయ కాంతిరూపం
చుక్కానియై వెలుగువాకిళ్ళను
తెరుస్తుంది
పరుగుపెట్టలేని గుర్రం పరుగులు
తీయిస్తుంది... గెలుపు గుర్రమవుతుంది
అల్లాఉద్దీన్ అద్భుతదీపమై
మనిషిని మహోన్నతుణ్ణి చేస్తుంది
స్ఫూర్తిని రగిలించడమంటే ఇదే కదా -
కొయ్యదే అయినా మెమెంటో
భుజం తట్టి భరోసాయిస్తుంది
రేపటి మహోదయానికి
స్వాగతం పలుకుతుంది
స్వాతిచినుకు ముత్యమయ్యే సువర్ణావకాశం
ఇదే కదా
గొంగళి సీతాకోక చిలుకయ్యే
మూమెంట్స్ అందివ్వడమే కదా
మెమెంటో అంటే -
గుండెను ఉషః సమీరంగా మలచి
ఉవ్వెత్తున ఎగసిపడే
కెరటం వీవెన వీచేది
కొయ్యగుర్రం సృష్టించే అలలతోనే కదా
ఆకాశమంత పయనానికి
అద్భుత ప్రారంభం జరిగేది
కేవలం ఈ గుర్రంతోనే -
వర్తమాన మేనేజ్‌మెంట్
సిద్ధాంతానికి ఉత్థాన కాంతులీనేవి
శక్తివంతమైన ఈ గుర్రాలే కదా
ఘనీభవించిన జ్ఞాపకాల
తోరణాలే ఈ జ్ఞాపికలు
ఈ జ్ఞాపికలే
జ్ఞాపకాల హరివిల్లులై
మనసును మానససరోవరం వైపు
పరుగులు పెట్టిస్తాయి
మనిషిని కొత్త పుంతలు తొక్కించి 'అగ్రగామిని' చేస్తాయి

## వానలు కురవాలి... వరి చేలు పండాలి

### సహస్ర ఘటాభిషేకంతో సంగమేశ్వరుని వేడుకున్న సంగం ప్రజలు



వరుణదేవుని కరుణించమని వేడుకొంటూ నెల్లూరు జిల్లాలోని మండల కేంద్రమైన సంగంలో వున్న సంగమేశ్వరాలయంలో ఈనెల 21న సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయంలోని శివలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపి తదుపరి భక్తులు అర్చకులు కలిసి వేదమంత్రోచ్ఛారణల నడుమ పెన్నానదిలోని సంగమస్థానం వద్దకు వెళ్ళి గంగపూజ చేసి పవిత్ర జలాలను సేకరించారు. వందలాది మంది భక్తులు బిందెల్లో పెన్నానది జలాలను నింపుకొని హరహరమహాదేవ, శంభో శంకరా అని స్తుతిస్తూ ఆలయానికి చేరుకొని ఆలయంలో మూలవిరాట్‌కు సమర్పించారు. ఆలయంలో బిల్వవృక్షం సమీపానున్న పాతాళలింగానికి కూడా భక్తులు పవిత్ర జలాలను సమర్పించారు. ఆలయ పై భాగంలో వున్న సంగమేశ్వరునికి అర్చకులు పవిత్రజలాలతో ఘటాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి నవీన్‌కుమార్, ప్రధానార్చకులు గోపాలకృష్ణమూర్తి, కేసరి కుమారస్వామి, రఘుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

రంజాన్ మాసం సందర్భంగా నెల్లూరులోని అన్ని మసీదుల వద్ద ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మేయర్ అబ్దుల్ అజీజ్ అధికారులకు సూచించారు. ఈ నెల 21న ఆయన నగరంలో బుజబుజనెల్లూరు, శ్రామిక నగర్, రామకోటయ్య నగర్, చంద్రబాబునగర్, టైలర్స్ కాలనీ ప్రాంతాలలో పర్యటించారు. మసీదుల వద్ద పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలకసంస్థ కమిషనర్ జాన్‌శ్యాంసన్, కార్పొరేటర్లు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

## ఆగష్టు 8 నుండి మనగుడి




ఆగష్టు 8వ తేదీ నుండి మూడురోజుల పాటు జిల్లాలోని అన్ని దేవాలయాల్లో మనగుడి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయశాఖ ఆర్‌జెసి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నెల్లూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ, హిందుధర్మ ప్రచారపరిషత్, దేవాదాయ ధర్మాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఐదో విడత మనగుడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 15దేవాలయాలలో శ్రావణమాసం వేడుకలను నిర్వహిస్తామన్నారు. 8వ తేదీ ఆలయశోభ, వరలక్ష్మీ వ్రతం, 9వ తేదీ తిరుమంజనం, 10వ తేదీ రక్షాబంధనం, రామకోటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలకు విచ్చేసే భక్తులకు గోవిందనామాలు, సుప్రభాతం పుస్తకాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు, కంకణం, అక్షింతలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ధర్మప్రచార మండలి అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండాశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ధనుంజయ, టీటీడీ ధర్మప్రచార పరిషత్ సమన్వయకర్త ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో సాంస్కృతిక పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నెల్లూరు అన్నమయ్య సర్కిల్ వద్దగల ఇస్కాన్ మందిరంలో ఈ నెల 27న సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి డాక్టర్ సుఖదేవస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలలో ఫ్యాన్సీ డ్రస్, డ్రాయింగ్, పెయింటింగ్, వక్తృత్వపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాల కోసం 9533326601 నెంబర్‌ను సంప్రదించాలని, ప్రతి పోటీలో మొదటి ముగ్గురు విజేతలకు ఆగష్టు 18 శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున సర్టిఫికేట్లు, జ్ఞాపికలు, ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 25.07.2014 నుండి
తేది. 31.07.2014 వరకు

ఈ వారం మిథునంలో శుక్రుడు, కర్కాటకంలో రవిబుధగురువులు, కన్యలో రాహువు మీనంలో కేతువు, తులలో శనికుజులు, మిథున కర్కాటక సింహకన్యరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
తేది 29 మంగళవారము మంగళగౌరీవత్రము.
గురుమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.

**ఆషాడమాసకృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | చతుర్ధశి | రా॥గం.1.03వ॥ |
| తేది. 26 | శని | అమావాస్య | రా॥గం.2.48వ॥ |

**శ్రావణమాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | ఆది | పాఢ్యమి | రా॥గం.4.45వ॥ |
| తేది. 28 | సోమ | విదియ | పూర్తిగా |
| తేది. 29 | మంగళ | విదియ | ఉ॥గం.6.47వ॥ |
| తేది. 30 | బుధ | తదియ | ఉ॥గం.8.43వ॥ |
| తేది. 31 | గురు | చతుర్ధి | ఉ॥గం.10.23వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపారవర్గాల వారు పోటీలు తట్టుకొని అభివృద్ధి సాధిస్తారు. మరియు ఆదాయం పెరుగుతుంది. వృత్తి నిర్వహణలో చిన్న చిన్న ఇబ్బందులుండినా అధిగమిస్తారు. రాజకీయవర్గాల వారు ప్రాబల్యం పెంచుకొంటారు. కొత్త పెట్టుబడులకు, డబ్బు మదుపుకు మంచి అనుకూల పరిస్థితులుంటాయి. కోర్టు వ్యవహారాలు పరిష్కార మార్గానికి చేరగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపార ఒప్పందాలు, వ్యాపార విస్తరణ జరపడం, ఆర్థికంగా బలపడటం, ఆదాయము పెరుగుదల ఉంటుంది. అదనంగా ఖర్చులుంటాయి. కాని ఇబ్బంది కలుగదు. బిల్లులు, పన్నుల చెల్లింపు సకాలంలో చేస్తారు. రావలసిన బాకీలు వాయిదా పడవచ్చును. కాంట్రాక్టర్లకు, ఫ్యాక్టరీ యాజమాన్యాలకు వర్కర్ల వల్ల చిన్న ఇబ్బందులుంటాయి. శుభకార్యాలు, వివాహ ప్రయత్నాలు నిర్ణయంకాగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధుమిత్రులతో సత్సంబంధాలుండి వారి సహాయ సహకారాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలలో ప్రాచుర్యం పెరుగుతుంది. ఆదాయవృద్ధి ఉంటుంది. సహచరులకు, సత్కార్యాలకు సహాయం చేస్తారు. వివాహాది శుభకార్యాలు నిర్ణయం కాబడతాయి. దూరప్రయాణాలు చేస్తారు. ఇంటా బయటా మీకు మంచి గుర్తింపు లభించగలదు. విద్యార్థులకు మంచి విద్యాప్రగతి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి ఉపాధిరంగాలలో జీవనము కలవారికి సామాన్య ఆర్థికస్థితి ఉంటుంది. వ్యాపారవర్గాలకు ఆదాయము సంతృప్తికరము కాని ఏదో ఒక కారణంతో ఖర్చులు పెరుగుతుంటాయి. పెద్ద మొత్తాలలో పెట్టుబడులు, వ్యాపార విస్తరణ వంటివి ప్రస్తుతం చేయకూడదు. స్టాక్ మార్కెట్ వర్గాలకు స్వల్ప లాభాలుంటాయి. వ్యవహారాలలో తొందరపాటు, పొరపాట్లు దొర్లే అవకాశం ఉన్నది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మీ పనులు అనుకున్న విధంగా సాగవు ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకావడం, ప్రభుత్వం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనడం జరుగుతుంది. బంధువులు మీ ఆర్థిక వ్యవహారాలకు సమస్యలు కలిగిస్తారు. వ్యాపారవర్గాలకు అవకాశాలు తప్పిపోయి ఆదాయం తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల వల్ల మానసిక ఆందోళన ఉంటుంది. వృత్తి ఉద్యోగ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేపట్టిన పనులు సరిగా జరగక ఆందోళన ఎక్కువగా ఉంటుంది. చెల్లింపులు సకాలంలో జరుపుతారు. కుటుంబంలో అనుకూలత లేకపోవడంతో ఇబ్బంది పడతారు. వృత్తి, ఉపాధి రంగాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. కొత్త పథకాలు, కొత్త ఆకర్షణలతో వ్యాపార వర్గాలు ముందుకు సాగుతారు. రావలసిన బాకీలు కొంత చేతికి వస్తాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వాణిజ్య ఒప్పందాలు, కొత్త పెట్టుబడులు జరుపుటకు అనుకూలం. ఋణ చెల్లింపులు, పన్ను చెల్లింపులు సక్రమంగా జరుపుతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక స్థితి బాగుంటుంది. ప్రయోజనకరమగు ఖర్చులే పెడతారు. ఉద్యోగులు, అధికారులకు పనిభారం ఎక్కువ మరియు ప్రలోభాలకు దూరంగా ఉండాలి. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికాభివృద్ధికి చేపట్టిన పథకాలు మంచి ఫలితాన్ని అందిస్తాయి. ఆదాయం బాగుంటుంది. అయినా కాదనలేని ఖర్చులు అదనంగా పైనబడతాయి. ఆర్థిక, వ్యవహారాలలో సంప్రదింపులకు, ఒప్పందాలకు సరైన సమయమిది. ఇతరులతో సలహాపడి, పనులు చేయడం మంచిది. శుభకార్యాలు నిర్ణయంకాగలవు. వస్తు వాహన రిపేర్లు ఉండగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకోని ఆర్థికఇబ్బందుల నెదుర్కొనవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాల నిర్వహణ అసంతృప్తిగా ఉంటుంది. చేపట్టిన పనులు కూడ సరిగా జరగవు. కొత్త పెట్టుబడులు భాగస్వామ్య వ్యాపార పెట్టుబడులు తాత్కాలికంగా నిలపడం మంచిది. అవసరాలకు డబ్బు సహాయం లభిస్తుంది. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికాభివృద్ధి బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, పొదుపు పథకాలతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయంకాగలవు. స్థిరాస్తుల లావాదేవీలలో పాల్గొంటారు. కోర్టు కేసులలో అనుకూలత, రావలసిన బాకీలు కొంత లభించడం, పన్నులు చెల్లింపులు సక్రమంగా చేయడం జరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు చేజారవచ్చును మరియు ఆశించిన ఆదాయముండదు. అదనపు ఖర్చులు పెరిగి ఇబ్బందిపడతారు. అనుకున్న పనులు జరగడానికి శ్రమపడవలసి వస్తుంది. కుటుంబ వ్యవహారాలలోగాని, ఆర్థిక వ్యవహారాలలోగాని లౌక్యంగా ప్రవర్తించండి. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతారు. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికముగా బాగుంటుంది. వృత్తి, ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకొంటారు. మంచి వ్యాపార అవకాశాలు లభిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను పట్టుదలగా శ్రమించి జరుపుకొంటారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, విద్యాప్రగతి బాగుంటుంది. స్థిరాస్తులపై ఆదాయం, షేర్లు లాభించడం జరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల అనుకూలత బాగుంటుంది.

# ఆంధ్రమంటే అంత అలుసా

- షేకు కాళేషాసాహెబ్, ఎం.ఏ., ఎం.ఎడ్.,
ఆంధ్ర భాషా పండితుడు, నెల్లూరు.

ఎంతదారుణం - ఎంత ఘోరం
ఎంత దౌర్భాగ్యం - ఎంత దుర్మార్గం
ఆంగ్ల భాషా సంస్కృతిలో ఆంధ్ర మాత విలపిస్తుంది
మమ్మీడాడీ, సంస్కృతిలో మాతృభాష మంటగలుస్తుంది
పసికూనల కంఠస్వరాలలో ముద్దులొలికే
మధుర మాతృభాష మరుగునపడుతుంది
అమ్మా, నాన్న పలుకులలో ప్రస్ఫుటించే
పసందైన మధురత్వము, ఆహ్లాదము అంతరిస్తుంది
చిరునవ్వులు చిందిస్తూ - చిలుక పలుకలనాస్వాదించే
చిన్నారుల చిరుగుండెలకు, తియ్యని తెలుగు "శరాఘాతమేనా"
ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్జనలో విశిష్టమైన
ఆంధ్ర భాషా ఆనందము, వికాసము, అంతరించేనా!
నేడు "హైదరాబాదు నగర "డాన్‌బో" విద్యాలయ దుర్నీతికి
చిన్నారుల చిరు అధరాల నుండి జాలువారిన
తియ్యని తెలుగు పలుకులు, చిరుగుండెలకు "గొడ్డలిపెట్టేనా"
విజ్ఞులారా! వివేకవంతులారా! ఒకమారు ఆలోచించండి
అవలోకించండి! ఆంధ్ర భాషకు జరిగే అవమానాన్ని,
అన్యాయాన్ని - రూపు మాపండి
మాతృభాషా, మనోజ్ఞత, మహనీయత కోసం
ఆంధ్ర భాషాభివృద్ధికి పాటు పడండి.

# తొలగించిన కలుషిత రక్తం

నెల్లూరులోని రెడ్‌క్రాస్ సంస్థ రక్తనిధి కేంద్రం నిర్వహణలో జరిగిన రక్తదాన శిబిరాల్లో సేకరించిన రక్తంలో కలుషిత రక్తాన్ని ఈనెల 21న తొలగించారు. ఈనెల 12 నుంచి 27 వరకు సేకరించిన 346యూనిట్ల రక్తంలో 9యూనిట్లు హెచ్ఐవి, మలేరియా తదితర వ్యాధుల లక్షణాలున్న రక్తాన్ని అధికారులు గుర్తించి వాటిని తొలగించి బయోహజార్డ్ కంపెనీకి అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్, పెంచలసుబ్బయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న భాజపా

నెల్లూరు మినీబైపాస్‌లోని భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో ఈనెల 21న జరిగిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డిలు పాల్గొన్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సారధ్యంలో నెల్లూరుజిల్లా బాగా అభివృద్ధిని సాధిస్తుందని, నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు కొరకు రూ॥550 కోట్లు, తాగునీటి కోసం రూ॥500కోట్లు హడ్కో నిధులు విడుదల చేస్తామని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ప్రకటించారని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో రానున్న ఐదేళ్ళ కాలంలో భాజపా ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందన్నారు. తమ పార్టీ విధి విధానాలు నచ్చి ఎంతో మంది నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. నెల్లూరులో ఎఫ్ఎం రేడియోస్టేషన్ నిర్మాణం జరుగుతుందని, తెలిపారు. పులికాట్ సరస్సులో పూడిక తీతకు, బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కృషిచేస్తామని, ఫిషరీస్ యూనివర్శిటీని కూడా నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి, దళితమోర్చా జిల్లా అధ్యక్షులు ఏ.కె.జయరాజ్, నాయకులు నరసింహులునాయుడు, జనార్ధన్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ముస్లిం యూత్ సేవా కార్యక్రమం



నెల్లూరుజిల్లా ముస్లీం సేవా కమిటి ఆధ్వర్యంలో రంజాన్ నెల శుభ సందర్భంలో దువా చేసి పాలస్తీనాలో మరణించిన వాళ్ళకు మరియు మలేషియా విమాన దుర్ఘటనలో మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ హాస్పిటల్‌లోని రోగులకు ఉచితంగా ఓ.ఆర్.యస్. జ్యూస్, అరటి పండ్లు, దానిమ్మ కాయలు, బ్రెడ్‌లు ముస్లీం యూత్ సేవా కమిటీ ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎజాజ్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఖలీల్, మున్నా, ఇస్సాక్, ఎస్.ఆర్.ఆలీ, ఎస్.కె.ఖాలీద్, ఫజల్, ఎస్.కె.అల్తాఫ్, గౌసు, జాబీద్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకయ్యకు 'అక్షర సుమమాలిక'



నీతి నిజాయితీలకు ప్రతీకగా
రాజకీయరంగంలో నిబద్ధతకు పతాకంగా నిలచి
వాగ్దేవి వరపుత్రునిగా
సింహపురి సీమ ముద్దుబిడ్డగా... రాణిస్తూ
పుట్టిన గడ్డకు అపారమైన సేవలందిస్తూ
సింహపురి సీమకే గర్వకారణంగా నిలుస్తున్న
మహానేత మీరు, మా ప్రియతమ నేత మీరు.
మీకిదే మా హృదయపూర్వక స్వాగతం... సుస్వాగతం!!
జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి
రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగినా
ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి వుండే
మంచి మనస్తత్వం మీది - మహోన్నత వ్యక్తిత్వం మీది
మన సంస్కృతీ సంప్రదాయాలు మరింతగా వెల్లివిరియాలని
భారతదేశపు ఖ్యాతి దశదిశలా మార్మోగాలనీ
ప్రజలంతా శాంతి సౌఖ్యాలతో జీవించాలనీ ఆకాంక్షిస్తూ
దేశాభ్యున్నతిని కాంక్షిస్తూ
కృషి చేస్తున్న మహోన్నత నేత మీరు... మానవతా మూర్తి మీరు!
జాతీయ నేతగా.. కేంద్రమంత్రిగా
ఢిల్లీలో వున్నా గల్లీలోని జనం బాధలు తెలుసుకొంటూ...
ప్రజలందరి ఆకాంక్షలు నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తూ
సింహపురి సీమ అభివృద్ధి ప్రదాతగా
మా అందరి ఆత్మీయ నేతగా వున్న మీకు
ఇవే... మా అక్షరాభివందనాలు
ఇవే... మా హృదయపూర్వక అభినందన చందనాలు.

కేంద్రమంత్రి, నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు నెల్లూరుకు వచ్చిన సందర్భంగా ఆయనను కీర్తిస్తూ వర్ధమానకవి కాళహస్తి వెంకటశేషగిరిరావు రచించిన "అక్షర సుమమాలిక".

# సౌమ్యుకరిది... సోకొకరిది

**• వెంకయ్య అభిమానులను నిరాశ పరచిన పౌరసత్కారం**

**వెంకయ్యనాయుడంటే అజాతశత్రువు. పేరుకి ఆయన బీజేపీ పార్టీ వాడైనా ఆయనకు అందరూ మిత్రులే. ముఖ్యంగా నెల్లూరన్నా నెల్లూరీయులన్నా ఆయన విపరీతమైన ప్రేమాభిమానాలను చూపిస్తాడు.**

అయితే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వెంకయ్య తొలిసారి నెల్లూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా పౌర సత్కారం పేరుతో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం వెంకయ్యనాయుడి అభిమతానికి విరుద్ధంగా జరగడం విమర్శలకు దారితీసింది.

వాస్తవానికి నెల్లూరీయుల పక్షాన ఆయనకు పౌరసత్కారం చేయవలసింది మునిసిపల్ కార్పొరేషన్, అయితే పౌర సత్కారం అన్న పేరుని హైజాక్ చేసి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ పక్షాన తాము చేస్తున్నట్లుగా ఆదాల ప్రభాకరరెడ్డి, బీద రవిచంద్రలు పాత్రికేయ సమావేశంలో ప్రకటించారు.

అయితే కార్యక్రమం జరిగిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌కి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎలాంటి చార్జీలు వసూలు చేయకపోగా దాదాపు రెండువేల మందికిపైగా పాల్గొన్న అతిథులకు విందును కూడా తన స్వంత ఖర్చుతో భరించాడు. ప్రభాకరరెడ్డికి కూడా అజాతశత్రువు అనే పేరుంది. ఆయన వై.యస్.ఆర్.సి.పి.కి చెందిన వాడైనా అన్ని ఇతర పార్టీల వారికి ఆయనంటే గౌరవం. అదే విధంగా ప్రభాకరరెడ్డి కూడా అందరితో సత్సంబంధాలు కలిగి వుంటాడు. విపిఆర్‌లో జరిగిన సభలో సైతం వెంకయ్యనాయుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఆయన నెల్లూరుకు అందించిన అమోఘమైన కన్వెన్షన్ సెంటర్‌ని సభాముఖంగా కొనియాడారు. అయితే ఈ కార్యక్రమం తలపెట్టిన రోజు నుండి "పౌరసత్కార సంఘం" సమన్వయకర్తలుగా వ్యవహరించిన వారు కానీ, ఈ సంఘంలోని ఇతర సభ్యులు కానీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరును ప్రస్తావించకపోవడం, అంతేకాకుండా అజాతశత్రువుగా పేరున్న వెంకయ్య నాయుడి సత్కార కార్యక్రమానికి తమకు గిట్టని వారిని ఆహ్వానించకపోవడం వెంకయ్య అభిమానులను సైతం బాధించింది.

కార్యక్రమ భారమంతా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి భరిస్తే అంతా తామే చేశామన్నట్లుగా ఫోటోలకు ఫోజులిచ్చిన ఆహ్వాన సంఘం తీరు కూడా వెంకయ్య అప్తులకు నచ్చలేదు. సౌమ్యుకరిది... సోకొకరిదా....? అని వాళ్ళల్లో వాళ్ళే చర్చించుకోవడం కనిపించింది. ఏది ఏమైనా వెంకయ్యలాంటి వ్యక్తిత్వం వున్న వ్యక్తులను ఇలాంటి వివాదాలలోకి లాగి ఆయన మనసుకు కష్టం, ఆయనని ఇష్టపడే వారికి బాధ కలిగించడం విచారకరం.

# కాకతీయ సేవా సమితి ఆత్మీయ సత్కారం



నెల్లూరు దర్గామిట్టలోని హోటల్ లియోలో ఈ నెల 21న కాకతీయ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు రావి మోహన్‌చౌదరి, మక్కెన అంకయ్య చౌదరి ఆధ్వర్యంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, ఉదయగిరి శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు, నెల్లూరు నగర కార్పొరేటర్లు పొత్తూరి శైలజ, అంచూరి జానకి, నెల్లూరు సునీత, బొల్లినేని శ్రీవిద్య, దొడ్డపనేని రాజానాయుడు, మన్నెం పెంచలయ్యలకు ఎన్నికలలో విజయం సాధించినందుకు ఆత్మీయసత్కారం చేయడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కడపజిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, లియో గ్రూపు ఛైర్మెన్ బెంగుళూరు, సూరపనేని విద్యాసాగర్, సువర్ణభూమి డెవలపర్స్ సి.యమ్.డి.బొల్లినేని శ్రీధర్, అశ్వమేధ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్, అనంతపురం, ఎన్.టి.చౌదరి, తెలుగుదేశం పార్టీ ఐ.టి. వింగ్ ప్రెసిడెంటు మానం బ్రహ్మం, దాసరి నందకిషోర్, టిడిపి ఆత్మకూరు ఇన్‌చార్జ్ గూటూరు కన్నబాబు, నెల్లూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంటు యాలమూరి రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకతీయ సేవా సమితి అధ్యక్షులు రావి మోహన్‌చౌదరి మాట్లాడుతూ మనం ఆర్థికంగా బాగా ఉన్నాం, మనం పుట్టిన ఈ ప్రాంతానికి మన సామాజిక వర్గంలోనే కాక ఇతర వర్గాలలో వెనుకబడిన వారందరికి ఇతోధికంగా సహాయం చేసి సేవాగుణంలో అందరికంటే ముందు ఉండాలని కోరారు. ఉదయగిరి శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ విద్య, వైద్యం ఉపాధి విషయాలలో ప్రభుత్వం ద్వారా మా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లా వ్యాప్తంగా సహాయం చేస్తామన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదల, సహాయం చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో పెంపొందించుకోవాలని, అవసరమైన వారందరికి మా ద్వారా మరియు ప్రభుత్వం ద్వారా సహాయం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు.

సమావేశంలో కార్పొరేటర్లను, శాసన సభ్యులను కాకతీయ సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. సభలో కమ్మ సామాజిక వర్గ ప్రముఖులు 500 మంది హాజరయ్యారు.

## కాలధర్మం

### ఆలూరు వెంకట సుబ్బారెడ్డి (తాతయ్య)



గత 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక చింతనాతత్పరుడిగా శ్రీ రాజరాజేశ్వరీ ఉపాసకుడిగా ఎంతోమందిని ఆకట్టుకున్న ఆలూరు వెంకటసుబ్బారెడ్డి తన 89వ యేట జులై 21వ తేదీ సోమవారం పరమపదించారు. నెల్లూరుజిల్లా కోవూరులో రైతు కుటుంబంలో జన్మించిన వెంకటసుబ్బారెడ్డికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. తన సొంత స్థలంలోనే దాదాపు మూడు దశాబ్దాల క్రితం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడి నిర్మించి దేవీ ఉపాసకుడిగా అందరికీ మంచిని బోధిస్తూ "తాతయ్య" అని పిలిపించుకుంటుండేవారు. కోవూరు పాటూరురోడ్డులో వున్న ఈ ఆలయానికి నెల్లూరుజిల్లా నుండే కాక ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు వచ్చి దేవి దర్శనం చేసుకుని తాతయ్య ఆశీస్సులు పొంది వెళ్ళడం ఆనవాయితీ. ఆయన మనుమడు ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి దంత వైద్యుడిగా జిల్లా వాసులకు సుపరిచితుడే. తాతయ్య ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### 'తరంగబ్రహ్మ' అర్రా కృష్ణమూర్తి

ప్రముఖ సంగీత విద్వాంసులు, తరంగబ్రహ్మ బిరుదాంకితులైన అర్రా కృష్ణమూర్తి(87) ఈనెల 23వతేదీ ఉదయం కన్నుమూశారు. అర్రా కృష్ణమూర్తి నారాయణ తీర్థులవారి తరంగాల గానంలో సుప్రసిద్ధులు. అంతే కాదు, నగరంలో గత యాభై సంవత్సరాలుగా ఆయన నారాయణతీర్థ తరంగాల శిక్షణ కేంద్రాన్ని కూడా స్థాపించి, ఎంతోమందిని సంగీతంలో తీర్చిదిద్దారు. సినీ రంగంలోనూ ఎందరో ప్రముఖులతో కలిసి సహాయ సంగీత దర్శకులుగా పనిచేశారు. దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపును పొందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు వున్నారు. సంగీతరంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని, ఆయన మృతి సంగీతరంగానికి తీరనిలోటని సంగీతాభిమానులు, సంగీతవేత్తలు ఈ సందర్భంగా అర్రా మృతికి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నారాయణతీర్థుని తరంగాలను సంగీతాభిమానులెందరికో పరిచయం చేసి, ఆ తరంగాలను మరింత మందికి నేర్పడం ద్వారా సంగీతరంగానికి ఆయన చేసిన సేవలు ఎంతో గొప్పవని, ఆయన లేని లోటు తీరనిదని ప్రముఖగాయని, శ్రీ కృష్ణ లీలాతరంగ ప్రచారసమితి నిర్వాహకులు రాళ్లపల్లి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మూగజీవాలు

(5వపేజీ తరువాయి)

తొట్లు ఏర్పాటుచేయడం ఎంతో అవసరం. మానవత్వంతో, భూతదయతో.. సాటి జీవులపట్ల కరుణతో చేపట్టాల్సిన ఇలాంటి చర్యలను ఎవరికి వారు స్వచ్ఛందంగా, చిత్తశుద్ధితో చేయగలగాలి. ఏదేమైనా, మూగజీవాలకు గుక్కెడునీరు, పిడికెడు మేత ఎల్లప్పుడూ కరువు లేకుండా చూడాలన్నదే అందరూ కోరుకునేది!..పశుపక్ష్యాదులను కాపాడుకోవడమంటే, పర్యావరణాన్ని కూడా పరిరక్షించుకోవడమే అవుతుంది.

• సత్కార్యం

# పేద విద్యార్థులకు...

# ఎమ్మెల్యే కోటంరెడ్డి చేయూత



- ప్రతిభగల విద్యార్థులకు పురస్కారాలు
- నెలసరి జీతం వారికే కేటాయిస్తామన్న ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన రూరల్ ప్రజలకు ఆయన తన కృతజ్ఞతలు చెప్తూ, ఈ సందర్భంగా రూరల్ పరిధిలోని నిరుపేద విద్యార్థుల చదువు కోసం తన వంతు చేయూతనందివ్వాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు తనకు నెలనెలా వచ్చే జీతాన్ని ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువు కోసం వినియోగిస్తామని ఆయన ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రూరల్ పరిధిలో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు ప్రతిభగల విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన నగరంలోని వైఎస్సార్సీపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ, పేదరికం వల్ల కొంతమంది ప్రతిభగల పేద విద్యార్థులు తమ చదువును కొనసాగించలేక, మధ్యలోనే ఆపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి చదువుల కోసం సాయం చేయడం ఎంతో అవసరమని, తద్వారా ఆ నిరుపేద విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి వస్తారని అన్నారు. కొంతమంది నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుని, విదేశాల్లో వున్న నెల్లూరీయుల సహకారంతో వారి విద్యాభివృద్ధికి బాటలు వేసేందుకు కూడా కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఏడాది ఇదేవిధంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తామన్నారు. అంతేకాక, రూరల్ ప్రాంతంలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు, మంచినీటి వసతి ఏర్పాట్ల కోసం కొంత నగదును సాయం చేసేందుకు విదేశాల్లో వున్న మన నెల్లూరీయులు పలువురు ముందుకు వస్తున్నారని, తాను కూడా తన వంతుగా కొంత నగదును జతచేసి, ఆ నిధితో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సంకల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. గత ఎమ్మెల్యే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినా అవి ప్రభుత్వపరంగా జరిగేవని, అయితే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి నిరుపేద విద్యార్థుల భవితవ్యం కోసం తన సొంత నిధులను వెచ్చించి, తన స్నేహితులు, సహచరుల సహకారంతో ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. తాను కూడా తనవంతుగా తన తండ్రి స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమాలకు తమ సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి సూచించినట్లుగా ప్రతి ఏటా ఇద్దరు నిరుపేదలైన విద్యార్థుల చదువుకు అవసరమైన సాయం అందజేస్తామన్నారు. నిరుపేదలు, ప్రతిభావంతులైన విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనిచ్చేందుకు తమ సహకారం ఎల్లవేళలా వుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన పదిమంది విద్యార్థులకు రూ. 10వేల వంతున పురస్కారంగా అందజేశారు. గౌస్‌మొహిద్దీన్, నవీన్‌కుమార్, విజయలక్ష్మి, సౌజన్య, చైతన్య, సుమంత్, భావన, గౌరీమానస తదితరులు ఈ పురస్కారాలు అందుకున్నవారిలో వున్నారు. బుజబుజనెల్లూరుకు చెందిన ఎంసిఎ విద్యార్థిని పి. హరిత ల్యాప్‌టాప్ అగ్నిప్రమాదానికి గురికావడంతో, ఆమెకు సాయంగా రూ. 10వేలు అందజేశారు. సిద్ధవరప్పాడుకు చెందిన బండి పూజిత అనే చిన్నారి వైద్యసాయం కోసం మరో రూ. 10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, వందలాదిమంది విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో చెలగాటం

రాజకీయ నాయకుల విన్యాసాలకు, వివాదాలకు సామాన్య ప్రజలు బలైపోతుండడం సర్వసాధారణమే. ముఖ్యంగా రాజకీయ చదరంగంలో విద్యార్థులు పావులుగా మారుతుంటారు. తెలంగాణ ఉద్యమానికి ఆ ప్రాంత విద్యార్థులను కేసీఆర్ ఎరగా వాడుకున్నాడు. విద్యార్థులలో భావోద్రేకాలను రెచ్చగొట్టారు. వేలాదిమంది విద్యార్థులను ఆత్మాహుతి వైపు ఉసిగొల్పారు. నిన్నటిదాకా తెలంగాణ విద్యార్థుల బ్రతుకులతో, భవిష్యత్‌తో చెలగాటమాడిన కేసీఆర్ ఇప్పుడు ఆంధ్రా విద్యార్థులతో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతున్నాడు. గత యూపిఏ ప్రభుత్వంలో సోనియా చేసిన రాష్ట్ర విభజన పాపం ఇక్కడి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తల తోక లేకుండా చేసిన విభజనకు అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారు. ఇప్పుడు తెలంగాణ సీఎం కేసీఆర్ వితండ వాదం వల్ల తెలంగాణలోని సీమాంధ్ర విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడింది. తెలంగాణలోని వృత్తి విద్యా కాలేజీలలో చదివే ఆంధ్ర విద్యార్థులకు తమ ప్రభుత్వం ఫీజురీయంబర్స్‌మెంట్ చెల్లించదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే దీనిని భరించాలని మెలికపెట్టాడు. 1956ను స్థానికతకు కొలమానంగా తీసుకుంటామన్నాడు. 1956కు ముందు సీమాంధ్రులెవరూ పెద్దగా హైదరాబాద్ పోలేదు. హైదరాబాద్‌ను రాజధానిగా నిర్ణయించుకున్నాకే పెద్దసంఖ్యలో సీమాంధ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అక్కడే పన్నులు కట్టారు. అక్కడే స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. ఆ ప్రాంతంలో ఒకరిగా కలిసిపోయారు. కాని కేసీఆర్ ఈరోజు ప్రాంతీయ దుర్బుద్ధితో వారిని తెలంగాణ నుండి వేరు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్ పెద్దమొత్తం కూడా కాదు. విభజనతో వారికి వచ్చిన సంపదతో పోలిస్తే ఇది చాలాతక్కువ. ఇంతకాలం సీమాంధ్రులు ప్రోగుచేసిన హైదరాబాద్ సంపదనంతా సోనియాగాంధీ తెలంగాణకు దోచిపెట్టింది. కాని కేసీఆర్ కక్కుర్తి రాజకీయాలకు పాల్పడుతున్నాడు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై పేచీ పెట్టి ఇంజనీరింగ్ అడ్మిషన్లు జరుపకుండా విద్యార్థులను గాల్లో పెట్టి వినోదం చూస్తున్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

కనుపూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన కోనేరు, గ్రంథాలయాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు

## కోనేరులతో...
# పెరుగుతుంది భూగర్భ నీరు

గూడూరులోని కోనేటిమిట్ట ప్రాంతంలో ఆదివారంనాడు కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం కోనేరు, కనుమూరు సత్యనారాయణరెడ్డి స్మారక గ్రంథాలయ ప్రారంభోత్సవాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న ఈ కోనేరును హరిచంద్రారెడ్డి అధికమొత్తంలో డబ్బు వెచ్చించి నిర్మించడం ఎంతో అభినందనీయమని, తనకు కూడా ఆయనంటే ఎంతో ఇష్టమని తెలిపారు. కోనేరు ఎంతో శుభ్రంగా ఉందని, నిర్మాణం బాగుందని, దీనివల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. మంచి మనసున్న వారు మంచి పనులే చేస్తారన్నారు. దేవాదాయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. పేదవాడికి ఇల్లు నిర్మించే లక్ష్యం 2022 నాటికి పూర్తి చేస్తామన్నారు. గుజరాత్ రాష్ట్ర పాలన అందరికీ ఆదర్శంగా ఉంటుంద



సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ప్రక్కన మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

న్నారు. గుజరాత్‌లాగా 24గంటలు విద్యుత్ ఇచ్చేలా నాణ్యతమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పేదల ఇళ్ల నిర్మాణానికి రూ॥9లక్షల చెక్‌ను కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మేనేజింగ్ ట్రస్టీ హరిచంద్రారెడ్డి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ అనూరాధ, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బిజెపి జిల్లా నాయకులు సురేష్‌రెడ్డి, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, చదలవాడ హరిప్రసాద్, దేనముడు ట్రస్టు సభ్యులు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, వెంకటరావు, శివకుమార్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి సహకారం అందించండి



కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడును కలిసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శివకుమార్‌రెడ్డి

గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు తమవంతు సహకారం అందించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశం పార్టీ నాయకుడు పొనకా శివకుమార్‌రెడ్డి ఈ నెల 19న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఎం.వెంకయ్యనాయుడును నెల్లూరులో కలసి విన్నవించారు. పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని, అందుకు తమ వంతు బాధ్యతగా నిధులు మంజూరుచేయాలని విన్నవించారు. గూడూరు పురపాలక సంఘాన్ని ఆదర్శ పురపాలక సంఘంగా తీర్చిదిద్దేందుకు చేయూతనివ్వాలని కోరారు.

# లయన్స్‌క్లబ్ ప్రమాణస్వీకారం





ప్రమాణస్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గూడూరు డీవిఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షుడుగా సురేష్‌నాయుడు, కార్యదర్శిగా నవీన్ జయకుమార్, కోశాధికారిగా కడివేటి చంద్రశేఖర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ గవర్నర్ అమృతవల్లి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ రీజియన్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్, జోన్ ఛైర్మెన్ మల్లు విజయకుమార్‌రెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# బల్లితో డాక్టర్‌కు తప్పని లొల్లి



*గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఆధిపత్యపోరు నెలకొంది ఎన్నో ఏళ్లుగా పార్టీలో మంత్రిగా, ఎమ్మెల్యేగా పనిచేసిన బల్లి దుర్గాప్రసాద్‌రావుకు ఈసారి టికెట్ దక్కకపోవడం నియోజకవర్గానికి, రాజకీయాలకు కొత్త అయిన జ్యోత్స్నలతకు టిక్కెట్‌దక్కడం, సార్వత్రిక ఎన్నికల్లో ఆమె ఓడిపోవడం తెలిసిందే.*



ఓటమి పాలైన డాక్టర్ బత్తల రాధా జ్యోత్స్నలత రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తాను టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జినని ప్రకటించుకొని తన అనుచరులతో అధికారులతో కలసి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కోరడం పట్ల ఇక్కడ సీనియర్ నాయకులకు ఆగ్రహం తెప్పిస్తోంది.

బల్లిని అలకవీడి బుజ్జగించే సమయంలో గూడూరు టికెట్ సాధించుకొన్న జ్యోత్స్నలత తాను ఎమ్మెల్యేగా గెలిచినా బల్లి దుర్గాప్రసాద్‌రావు ఎమ్మెల్యేగా వ్యవహరిస్తారని, ఆయన అడుగుజాడల్లో తాను నడుచుకొంటానని ఎన్నికల ముందు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరువురు కలసి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించినా ఫలితం లేకపోయింది. అనంతరం జరిగిన పరిణామాల్లో టిడిపి ఓటమి పాలవడం, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో గూడూరు టిడిపి తరపున పోటీచేసి ఓటమి పాలైన జ్యోత్స్నలత నియోజకవర్గ ఇన్‌చార్జి అని ప్రకటించుకున్నారు. ఎన్నికల వరకు ఆమెతో సఖ్యతగా ఉన్న బల్లి తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. ఇప్పటి వరకు సఖ్యతగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు తనదైన శైలిలో తన అనుచరులతో కలసి నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తూ రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినందున తనకు జిల్లాలో నామినేటెడ్ పోస్టు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే జ్యోత్స్నలత కూడా నియోజకవర్గానికి కొత్త అయినా నియోజకవర్గంలో పట్టు సాధించుకోవాలన్న ఆలోచనలో ఆమె కూడా తనదైన శైలిలో పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఏది ఏమైనా నియోజక వర్గ ఇన్‌చార్జి బాధ్యతల విషయంలో పార్టీ అధిష్టానం ఒక నిర్ణయం తీసుకోకపోవడంతో ఇక్కడి కార్యకర్తలు, నాయకుల్లో అయోమయం నెలకొని ఉంది. దీనిపై పార్టీ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# ముస్లింలు అక్షరాస్యత సాధించాలి



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ముస్లిం నాయకులు

ముస్లింలు ఎక్కువ మంది చదువుకొని అక్షరాస్యత సాధించాలని రోడ్లు భవనాలశాఖ విశ్రాంత డీఈ సయ్యద్ మసూద్ అన్నారు. గూడూరులోని షాదీమంజిల్‌లో ఆదివారం మహ్మదీయన్ వెల్ఫేర్‌నెట్ ఆధ్వర్యంలో పేద ముస్లిం విద్యార్థులకు దుస్తులు, నోటు పుస్తకములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది ముస్లింలు విద్యకు దూరంగా ఉన్నారని, అందరూ చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్, ఖాదర్‌భాషా, షేక్ కరీముల్లా, ఇస్మాయిల్, రహీం, యూసఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# వైజెపి లయన్స్ నూతన కార్యవర్గం

గూడూరులోని డాక్టర్ వై.జె.ప్రభాకర్ రెడ్డి లయన్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో జరిగింది. నూతన అధ్యక్షురాలిగా కె.మంజులాదేవి, కార్యదర్శిగా ఎం.అశోక్‌కుమార్, కోశాధికారిగా పి.తులసీరాం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఫాస్ట్‌వైస్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నప్పరెడ్డి, డిస్ట్రిక్ గైడ్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ గవర్నర్ అమృతవల్లి, డాక్టర్ సీఆర్ రెడ్డి, రీజనల్





వైజెపి లయన్స్ సమావేశంలో మాట్లాడుతున్న డా॥సి.ఆర్.రెడ్డి

ఛైర్మెన్ ఆర్.వి.రావు, గురునాథం, మురళీనాయుడు, ఎస్‌ఎల్‌ఎన్ స్వామి, ఎస్.ఎల్.ఎన్. బాబు తదితరులు పాల్గొన్నారు.

# తొత్తులైన అధికారులొద్దు

### --- తెదేపా కార్పొరేటర్ల డిమాండ్ ---

గత పాలకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులతో నెల్లూరులో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగవని నగరపాలక సంస్థ ప్రతిపక్షనేత డాక్టర్ జడ్.శివప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తెలుగుదేశం మరియు బీజేపీ కార్పొరేటర్లతో కలిసి కమీషనర్ జాన్‌శ్యాంసన్ వద్దకు వెళ్లారు. అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసారు. సంబంధిత డిఇలు, ఏఇలతో తమకు ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి అధికారులను పెట్టుకుని స్థానిక ప్రజల సమస్యలు తీర్చలేకపోతున్నామని ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్ తమ ఆవేదన వ్యక్తం చేసారు. గత పాలకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులను బదిలీ చేయాలని కోరారు. కాలువల్లో మురికిని తీయాలని అధికారులకు ఫోన్‌లు చేసినా అసలు ఫోన్‌లెత్తడం లేదని చెప్పారు.

# నెల్లూరు ఆడపడుచుకి పుట్టినింటి సత్కారం



శ్రీపతిపండితారాధ్యుల సాంబమూర్తి కుమార్తె సుప్రసిద్ధ సినీగాయకులు పద్మ భూషణ్ గ్రహీతలు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం సోదరి శ్రీమతి యస్.పి.శైలజకు తన పుట్టినిల్లు నెల్లూరులో కళాంజలి సంస్థ ఆత్మీయ పురస్కారాన్ని అందజేసింది.

కళాంజలి అనంత్ సారధ్యంలో నెల్లూరు ఆడబిడ్డకు జరిగిన ఈ పురస్కార సంబరానికి మరో నెల్లూరు వాసి సినీ రచయిత వెన్నెలకంటి అధ్యక్షత వహించారు. తమ ఇంటి ఆడపడుచుకు నెల్లూరు గడ్డపై ఆత్మీయ పురస్కారాన్ని అందివ్వడం ఆనంద దాయకమని తన అధ్యక్షోపన్యాసంలో ఆయన అన్నారు.

ఇదే సందర్భంగా మాట్లాడిన లాయర్ ప్రభు శైలజమ్మను సత్కరించుకోవడమంటే నెల్లూరు జిల్లా ఆడపడుచులందరినీ సత్కరించుకున్నట్లేనన్నారు. సక్సెస్‌ఫుల్ సభలకు ట్రేడ్‌మార్క్‌గా "కళాంజలి" సంస్థను తీర్చిదిద్దిన అనంత్‌ను అభినందించారు.

ఈ కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథి వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళారంగానికి యస్.పి.కుటుంబం చేస్తున్న సేవను కొనియాడారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొనవలసిన శ్రీమతి దీపావెంకట్ అనారోగ్యకారణాల వల్ల రాలేకపోవడంతో ఆమె సందేశాన్ని సెల్‌ఫోన్ ద్వారా సభకు వినిపించారు.

శ్రీమతి శైలజకు కళాంజలి ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేసిన ఈ సభలో వీరిశెట్టి హజరత్‌బాబు, డా॥చంద్రసేన, బి.వి.నరసింహం, సుంకుబాబు, కెనరా బ్యాంక్ మేనేజర్ మురళీధర్, దేవరాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తనకు జరిగిన సత్కారానికి శ్రీమతి శైలజ స్పందిస్తూ చిన్ననాడు ఇదే టౌన్‌హాల్లో "నెఫ్జా" నిర్వహించిన పాటల పోటీలో పాల్గొన్న నాటి నుండి నేటి వరకు తనను వెన్నుతట్టి నడిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తన అభ్యున్నతికి కారకులైన నెల్లూరు వారందరి పేర్లు చెప్తూ వెళ్తే ఒక మాసం కూడా సరిపోదన్నారు. తమ తల్లిదండ్రుల పుణ్యఫలం వల్లనే తాము ఈరోజు ఈ స్థితిలో వున్నామని పేర్కొన్నారు. అనంతరం రెండు పాటలతో సభికులను వీనులవిందు చేశారు. సభా కార్యక్రమానికి ముందు చిన్నారులు మల్లాది అనూష, రాళ్ళపల్లి శివకుమార్, హంసిని, జ్ఞానశ్రీ, మధుబాబు, కృష్ణయ్య, సర్వేపల్లి రాజలక్ష్మి ఆలపించిన సుమధురగీతాలూ, ఆపాత మధురాలను ఏర్చికూర్చి పేర్చిన "జి.వి.శర్మ" ఎంపిక చేసిన అద్భుత సంగీత సరాగాలూ కార్యక్రమంలో చక్కని కాలక్షేపానికి వేదికగా నిలిచాయి. వాఖ్యాతగా వ్యవహరించిన "అరుణ్" రాబోయే గీతం గురించి వివరించిన తీరు, దశాబ్దాల నాటి పాత పాటలను అలవోకగా ఆలపించిన చిన్నారుల ప్రతిభ సభలోని వారిని ముగ్ధులను చేశాయి. సభా కార్యక్రమానికి శ్రీమతి వై.శైలజ వ్యాఖ్యాతగా వ్యవహరించగా బెనర్జి, విశ్వనాథం, నాతా కృష్ణకుమార్, ఎన్.సురేష్ బాబు, హరనాథ్ తదితరులు కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు.

# ప్రజాతీర్పు నిలిచింది

(మొదటిపేజీ తరువాయి)

లక్కీడిప్ నిర్వహించాల్సి వచ్చింది. లక్కీ డ్రాలో బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి విజేతగా నిలిచారు. అలాగే వైస్‌ఛైర్మెన్ ఎన్నికకు సైతం సమానంగా చేతులెత్తడంతో లక్కీడ్రా తీసారు. దీంట్లో కూడా వైకాపా వైస్‌ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేసిన సైదాపురం జడ్పీటీసీ పొట్టేళ్ల శిరీష విజేతయ్యారు. అంతకుముందు కో-ఆప్షన్ సభ్యులకు కూడా లక్కీడ్రా నిర్వహించగా ఇరుపార్టీలకు చెరొకటి దక్కింది.

జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రరెడ్డిది రాజకీయ నేపథ్యం వున్న కుటుంబం. ఆయన తండ్రి డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి గురించి ఈ జిల్లాలో తెలియనివారుండరు. మెట్టప్రాంతమైన ఆత్మకూరు ప్రాంతంలోని అన్ని మండలాలకు కూడా డాక్టర్ సుందరరామిరెడ్డి వైద్యదేవుడు. ఆయన హస్తవాసి అటువంటిది. ఆత్మకూరు మండలం బట్టేపాడు వారి స్వగ్రామం. ఆత్మకూరు నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత సుందరరామిరెడ్డిది. ఇప్పటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడినే 1985ఎన్నికల్లో ఓడించిన చరిత్ర ఆయనది. ఆయన రాజకీయవారసుడే రాఘవేంద్రరెడ్డి. 2006లో జరిగిన జడ్పీ ఎన్నికల ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాడు. ఏఎస్‌పేట నుండి జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. అప్పుడే జడ్పీ ఛైర్మెన్ పదవిని ఆశించారు గాని కాకాణి గోవర్ధన్ రెడ్డికి ప్రాధాన్యతనిచ్చారు. అయితే 2007లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో నెల్లూరు స్థానికసంస్థల శాసనమండలి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసి తెలుగుదేశం మరియు కాంగ్రెస్‌లోని కొందరి మద్దతుతో విజయం సాధించారు. 2008లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యంలో చేరి ఆ పార్టీ జిల్లా కన్వీనర్‌గా కొంతకాలం పనిచేసారు. 2009ఎన్నికల తర్వాత ఆ పార్టీ నుండి బయటకొచ్చారు. వై.యస్.జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించాక ఆ పార్టీలో చేరారు. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి గౌతంరెడ్డిల గెలుపుకు విశేషంగా కృషి చేశారు.

ముఖ్యంగా అధికారపార్టీ నుండి తమ పార్టీ జడ్పీటీసీలను కాపాడుకోవడంలో ఆయన ఆర్థికంగా, మానసికంగా దృఢంగా నిలిచారు. గట్టిగా నిలబడి పోరాడబట్టే జడ్పీ ఛైర్మెన్ కావాలన్న తన కలను నెరవేర్చుకున్నారు.

## కృషీవలుడు విపిఆర్



అత్యంత నాటకీయంగా జరిగిన నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నికలో పార్టీ అభ్యర్థికి అండగా నిలిచి చిత్తశుద్ధితో పనిచేసిన వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. జిల్లాలో సమన్వయకర్తగా పార్టీ బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా పరిషత్ కుర్చీని పార్టీకి సాధించి పెట్టడంలో పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేశాడు. ఎంతో ఓర్పుతో, నేర్పుతో వ్యవహరించి ఈ అనూహ్య విజయంలో ప్రభాకర్‌రెడ్డి భాగస్వామిగా మారి అభినందనలందుకున్నాడు.

## టీఎస్ఆర్‌కు కీలకపదవి



నెల్లూరీయుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కోశాధికారిగా నియమితులయ్యారు. గతంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన అన్ని రకాల పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. ఆ గుర్తింపుతోనే ఇప్పుడు మరో బాధ్యత అప్పగించారు.

# అసమానం ఈ అభిమానం

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగంగానే వెలిబుచ్చాడు. నెల్లూరుజిల్లా ప్రజలపై అలిగే ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక దాదాపు రెండునెలల దాకా జిల్లాలో అడుగుపెట్టలేదు. ఎంత బిజీగా వున్నా నెలలో కనీసం ఒకట్రెండు సార్లన్నా నెల్లూరుకొచ్చిపోయే మనిషి రెండు నెలల దాకా రాలేదంటే ఏ స్థాయిలో బాధపడ్డాడో అర్థం చేసుకోవచ్చు. అయితే రాజకీయాలను తీసి పక్కనపెడితే ఈ జిల్లా ప్రజలు ఎక్కువుగా అభిమానించే నాయకుడు వెంకయ్యనాయుడు. దీనికి కారణం క్రమశిక్షణతో కూడిన అతని రాజకీయ ఎదుగుదల. ఆయన ఏరోజూ పార్టీ మారలేదు. పదవుల కోసం దిగజారలేదు. ఓట్ల కక్కుర్తి రాజకీయాలు చేయలేదు. ఈ జిల్లా నుండి గెలవకపోయినా గతంలో కేంద్రమంత్రిగా ఈ జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేసారు. తన స్వయంకృషితో జాతీయస్థాయి నేతగా ఎదిగారు. కాబట్టే ఆయనంటే గౌరవం, అభిమానం.


ఆ అభిమానంతోనే నెల్లూరు జనం వెంకయ్య కోసం ఎదురుచూసారు. మరి ఆ జనానికే కాదు, నెల్లూరన్నా, నెల్లూరు జనమన్నా వెంకయ్యకు అభిమానమే. కేంద్రంలో కీలకమైన మంత్రి పదవిని చేపట్టాక నెల్లూరుకు పోవాలని, నెల్లూరు ప్రజల అభినందనలు అందుకోవాలని, వారితో మాట్లాడాలని ఆయనకూ వుంది. నెల్లూరుకు రాకముందు ఆయన హైదరాబాద్, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాలకు వెళ్లారు. కాని ఎక్కడ తిరిగినా నెల్లూరులో అడుగుపెట్టి, ఈ జనంతో మమేకమైతే వచ్చే ఆనందం ఇంకెక్కడా రాదుగా! ఆ ఆనందం కోసమే అలకను వీడి ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఆయన నెల్లూరులో అడుగుపెట్టారు. కేంద్రంలో రెండోసారి మంత్రి అయ్యాక తొలిసారి నెల్లూరుకు వస్తున్న వెంకయ్యను ఘనంగా స్వాగతించేందుకు నేషనల్ హైవే కార్యాలయం వద్దకు జనం భారీగా చేరుకున్నారు. జిల్లాలో ఇంతమంది బీజేపీ కార్యకర్తలున్నారా అని ఆశ్చర్యపడే రీతిలో బీజేపీ జెండాలు చేతపట్టి భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. జాతీయ రహదారి నుండి అయ్యప్పగుడి మీదుగా అందంగా అలంకరించిన ట్రాలీపై వెంకయ్యను ఎక్కించి ఊరేగించారు. ఈ ర్యాలీకి వచ్చిన కార్యకర్తలు వందరూపాయల నోటు, సారా ప్యాకెట్లు తీసుకుని వచ్చిన వాళ్ళు కాదు. నిలువెత్తు అభిమానంతో వచ్చినవాళ్లే! ఇక అనిల్ గార్డెన్స్‌లో బీజేపీ పార్టీ తరపున నిర్వహించిన అభినందన సభలో అయితే ఆయనపై పూలవర్షం కురిసింది. పూలమాలలతో ముంచెత్తారు. ఇక 19, 20తేదీలలో కూడా ఆయన నెల్లూరులో గడిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. నెల్లూరులో ఏఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై అధికారులతో చర్చించారు. వివరాలు తెలుసుకున్నారు.

మొత్తానికి జిల్లాలో వెంకయ్య మూడురోజుల పర్యటన నెల్లూరుతో ఆయనకున్న అనుబంధానికి ప్రతిరూపంగా నిలిచింది.

# రాజధాని కమిటీలో నెల్లూరోళ్లు



నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని ఎంపిక, నిర్మాణం కొరకు రాష్ట్ర రాజధాని నిర్మాణ సలహా కమిటీని ఏర్పాటు చేసింది. నెల్లూరీయుడు, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఛైర్మెన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో మరో ఏడుమందిని సభ్యులుగా తీసుకోగా వారిలో మరోఇద్దరు నెల్లూరీయులు కావడం విశేషం. జివికె ఇండస్ట్రీస్ అధినేత నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట కొత్తూరు వాసి జివికె రెడ్డి కుమారుడు గునుపాటి వెంకటసంజయ్‌రెడ్డి, కావలి మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావులను సభ్యులుగా నియమించారు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.